www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -180 శుక్రవారం16 అక్టోబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ఎల్ నినోతో నీటి సంక్షోభం

## రాష్ట్రంలో నీటి, విద్యుత్ సంక్షోభం తప్పదన్న : సీఎం రేవంత్ రెడ్డి

**యాసంగిలో వరి సాగు చేయకుండా ఆరుతడి పంటలు వేయాలని రైతులకు విజ్ఞప్తి**

**గతేడాదితో పోలిస్తే జలాశయాల్లో నీటి నిల్వలు సగానికి పడిపోయినట్లు వెల్లడి**

**సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రం సహకరించాలని కోరిన సీఎం రేవంత్**

**హైదరాబాద్ అక్టోబర్ 15 ,(ప్రజావినికిడి):**

తెలంగాణపై ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉందని, రానున్న రోజుల్లో రాష్ట్రం కఠినమైన నీటి, విద్యుత్ కొరతను ఎదుర్కోక తప్పదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఎల్ నినో విషయంలో శాస్త్రవేత్తలు అంచనా వేసినట్లుగానే పరిస్థితులు చేయిదాటిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంక్షోభం ప్రజల దైనందిన జీవితంపై ప్రభావం చూపుతుందని, ప్రజలు, ముఖ్యంగా రైతాంగంద

మిగతాది 2లో...



# మనం చేసి చూపిద్దాం..

## ఏషియన్ గేమ్స్ హీరోలకు ప్రధాని మోదీ కొత్త నినాదం



**ఆసియా క్రీడల పతక విజేతలతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక భేటీ**

**క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపిన ప్రధానమంత్రి**

**భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్‌గా మారుస్తామని ఉద్ఘాటన**

**క్రీడా మౌలిక వసతుల ఆధునికీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం**

**మహిళల హాకీ, క్రికెట్, కబడ్డీ జట్ల చారిత్రక విజయాలపై ప్రశంసలు**

**న్యూఢిల్లీ అక్టోబర్ 15,(ప్రజావినికిడి):**

భారతదేశం అనతికాలంలోనే అంతర్జాతీయ క్రీడారంగంలో తిరుగులేని శక్తిగా (గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్) ఆవిర్భవించనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు-2026లో అద్భుత ప్రతిభ కనబరిచి దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేసిన భారత క్రీడాకారులతో గురువారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా "మనం చేసి చూపిద్దాం" అనే కొత్త నినాదంతో వారిలో స్ఫూర్తిని నింపారు. దేశంలో క్రీడా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, అథ్లెట్లకు అన్ని విధాలా అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు.

పతక విజేతలతో భేటీ కావడం అద్భుతమైన సందర్భమని అభివర్ణించిన ప్రధాని, క్రీడాకారుల అంకితభావాన్ని, వారు మిగతాది 2లో...

# మహిళా శక్తికి వేదికగా సరస్ మేళా

## విజయవాడలో ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు

**గ్రామీణ మహిళల ఉత్పత్తుల కోసం 'స్వయం ఏపీ' బ్రాండ్ ఆవిష్కరణ**

**మహిళలను సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబు**

**రాబోయే ఐదేళ్లలో మరో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తల తయారీకి ప్రణాళిక**

**అమరావతి అక్టోబర్ 15 ,(ప్రజావినికిడి):**

మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆర్థిక స్వావలంబన దిశగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మహిళలు ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని, సంపద సృష్టికర్తలుగా మారాలని ఆయన ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా, గ్రామీణ మహిళల నైపుణ్యాలకు, ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో వేదిక కల్పిస్తున్న జాతీయ సరస్ మేళా-2026ను మిగతాది 2లో...




# వైసీపీ సిద్ధం

## మున్సిపల్ పోరుకు వైసీపీ అభ్యర్థులు ఖరారు.

**. మేయర్, ఛైర్మన్ అభ్యర్థుల పూర్తి జాబితా విడుదల**

**మేయర్లు, ఛైర్మన్ల పూర్తి జాబితాను విడుదల చేసిన వైసీపీ అధిష్ఠానం**

**వైఎస్ జగన్ ఆమోదంతో తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన**


**జాబితాలో మహిళలు, బీసీ, ఎస్సీ వర్గాలకు గణనీయమైన ప్రాధాన్యం**

**7 కార్పొరేషన్లు, 14 మున్సిపాలిటీలు, 6 నగర పంచాయతీలకు అభ్యర్థుల పేర్లు వెల్లడి**

**అమరావతి అక్టోబర్ 15 ,(ప్రజావినికిడి):**

ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న మున్సిపల్ ఎన్నికల సమరానికి వైసీపీ పూర్తిస్థాయిలో సిద్ధమైంది. పార్టీ అధ్యక్షుడు జగన్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ అభ్యర్థులను, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ఛైర్మన్ అభ్యర్థులను ఖరారు చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం అధికారికంగా పత్రికా ప్రకటన ద్వారా అభ్యర్థుల పూర్తి జాబితాను విడుదల చేసింది. మొత్తం 27 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, సామాజిక సమీకరణాలు, మహిళా ప్రాతినిధ్యానికి పెద్దపీట వేసినట్లు స్పష్టమవుతోంది. మిగతాది 2లో...





# 17 రాష్ట్రాల్లో స్పెషల్ సమ్మరీ రివిజన్

**'సర్' వివాదం.. తెలుగు రాష్ట్రాలకు త్వరలో ప్రకటన**

**ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై తీవ్ర వివాదం**

**17 రాష్ట్రాల్లో స్పెషల్ సమ్మరీ రివిజన్‌కు ఈసీ ఆదేశం**

**2027 జనవరి 1ని అర్హత తేదీగా నిర్ణయించిన ఎన్నికల సంఘం**

**ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు తర్వాత షెడ్యూల్ ప్రకటన**

**న్యూఢిల్లీ అక్టోబర్ 15 ,(ప్రజావినికిడి):**

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్) ప్రక్రియపై చెలరేగుతున్న వివాదాల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. 'సర్' నిర్వహణలో తలెత్తిన లోపాలను సరిదిద్దే లక్ష్యంతో,మిగతాది 2లో...



# సీఎంవోలో 15 శాతం కమీషన్ దండా

**రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ తీవ్ర ఆరోపణలు**

**ప్రాజెక్టుల్లో సీఎంవో 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని విమర్శ**

**ఓ నిర్మాణ సంస్థ ఎండీ రాసిన లేఖను విడుదల చేసిన కేటీఆర్**

**హైదరాబాద్ అక్టోబర్ 15 ,(ప్రజావినికిడి):**

ప్రజా సంక్షేమాన్ని వదిలి కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారని ఫైర్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టులో ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఏకంగా 15 శాతంమిగతాది 2లో...

# న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు

## : సీజేఐ సూర్యకాంత్

**న్యూఢిలీఅక్టోబర్ 15 ,(ప్రజావినికిడి):**

న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి నాయకులు సుప్రీంకోర్టు వరకు చేపట్టిన నిరసన ప్రదర్శనపై ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. న్యాయస్థానంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు చేసే ప్రయత్నాలను ఎవరూ పట్టించుకోరని తేల్చిచెప్పారు. మిగతాది 2లో...



# సింగరేణిని ప్రైవేటుకు అప్పగించే ప్రసక్తే లేదు

## బొగ్గు మాయంపై ఆధారాలుంటే బీఆర్ఎస్ బయటపెట్టాలి: శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, అక్టోబర్ 15,(ప్రజావినికిడి):**

తెలంగాణ ప్రజలకు గుండె లాంటి సింగరేణి సంస్థను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రసక్తే లేదని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. సింగరేణి ప్రైవేటుపరం కాకుండా గతంలో కాపాడింది, ఇప్పుడు కాపాడుతున్నది, భవిష్యత్తులో కాపాడేది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. సింగరేణి అంశంలో బీఆర్ఎస్ నేతలు మిగతాది 2లో...



## సింగరేణిని ప్రైవేటుకు అప్పగించే ప్రసక్తే లేదు

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్న వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. సీఎల్పీ మీడియా హాల్లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన బొగ్గు గనుల వేలంలో సింగరేణి పాల్గొనకపోవడంతో కీలకమైన కోయగూడెం-3, సత్తుపల్లి-3 బ్లాకులు సంస్థకు దక్కలేదని శ్రీధర్ బాబు గుర్తు చేశారు. దాని వల్ల ఏటా 10 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చే+స అవకాశాన్ని సింగరేణి కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లలోనే నైనీ బొగ్గు గనికి అనుమతులు సాధించి ఉత్పత్తి ప్రారంభించామన్నారు. సింగరేణికి కొత్త గనులు సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఖనిజాలు, థర్మల్, సౌర విద్యుత్ రంగాల్లో సింగరేణి విస్తరించేలా కార్యాచరణ చేపడుతున్నామన్నారు. సింగరేణిలో బొగ్గు మాయం అంటూ బురద జల్లుతున్న బీఆర్ఎస్ నేతలు.. ఆధారాలుంటే బయటపెట్టాలని సూచించారు. సింగరేణికి రావాల్సిన బకాయిలను ఎగ్గొట్టి, సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టిందే బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. యాదాద్రి ప్లాంటును సాంకేతిక లోపాలతో మూలన పడేలా చేసిందన్నారు.

# మనం చేసి చూపిద్దాం..

(మొదటి పేజీ తరువాయి)

సాధించిన విజయాలను కొనియాడారు. "మీరు 140 కోట్ల మంది భారతీయుల గౌరవాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారు. త్రివర్ణ పతాక వైభవాన్ని చాటిచెప్పడమే మీరు సాధించిన అతిపెద్ద విజయం. లక్ష్యం పట్ల ఉన్న అభిరుచి విజయంగా రూపాంతరం చెందినప్పుడు, పతకాలతో పాటు ఆ క్రీడాకారుల ముఖాల్లో కనిపించే వర్చస్సు మీ అందరిలోనూ ప్రతిబింబిస్తోంది" అని మోదీ ప్రశంసించారు. ఈ ఘనత కేవలం క్రీడాకారులదే కాదని, దీని వెనుక కోచ్‌లు, సహాయక సిబ్బంది, కుటుంబ సభ్యులతో పాటు కోట్లాది మంది భారతీయుల ఆశీస్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇదే తరుణంలో, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

ఈసారి ఆసియా క్రీడలు భారత్‌కు ఎన్నో మైలురాళ్లను మిగిల్చాయని ప్రధాని గుర్తుచేశారు. సుదీర్ఘమైన 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ మహిళల హాకీ జట్టు స్వర్ణం కైవసం చేసుకోవడాన్ని, అలాగే పురుషుల హాకీ జట్టు కూడా పసిడి పతకంతో మెరవడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రికెట్, కబడ్డీ విభాగాల్లో భారత్ 'డబుల్ గోల్డ్' సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆర్చరీలో ఐదు స్వర్ణాలు, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్‌లో అథ్లెట్లు కనబరిచిన అద్భుత ప్రదర్శనలను అభినందించారు. అథ్లెటిక్స్‌లో కొత్త రికార్డులు నెలకొల్పడంతో పాటు, 28 ఏళ్ల తర్వాత వెయిట్‌లిఫ్టింగ్‌లో పతకం, 1982 తర్వాత మారథాన్‌లో విజయం వంటి చారిత్రక ఘనతలను ఆయన ప్రస్తావించారు.భారత్ సాధించిన మొత్తం 85 పతకాలలో మహిళా అథ్లెట్లు 11 స్వర్ణాలతో కలిపి మొత్తం 38 పతకాలు సాధించడం నవభారత ఆత్మవిశ్వాసానికి, మహిళా సాధికారతకు నిదర్శనమని ప్రధాని కొనియాడారు. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్, సాఫ్ట్ టెన్నిస్, సెయిలింగ్ వంటి క్రీడల్లో తొలిసారిగా పతకాలు సాధించడాన్ని ప్రస్తావిస్తూ, గతంలో ప్రాతినిధ్యమే లేని క్రీడల్లోనూ నేడు భారత్ విజయకేతనం ఎగురవేస్తోందని ఆనందం వ్యక్తం చేశారు.గత దశాబ్ద కాలంగా క్రీడారంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక చర్యలను మోదీ వివరించారు. ఒకప్పుడు దేశంలో క్రీడల పట్ల నెలకొన్న నైరాశ్యాన్ని అధిగమించి, నేడు నూతనోత్తేజంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. 'టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్' (టాప్స్), 'ఖేలో ఇండియా' వంటి పథకాల ద్వారా పారదర్శకమైన, అత్యాధునిక క్రీడా వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా క్రీడా సమాఖ్యలను బలోపేతం చేసేందుకు, క్షేత్రస్థాయి కార్యక్రమాల కోసం సుమారు రూ.36 వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. వెయ్యికి పైగా ఖేలో ఇండియా కేంద్రాలు, నూతన స్టేడియంలు, స్విమ్మింగ్ పూల్స్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.ప్రతిభావంతులైన అథ్లెట్లకు 'టాప్స్' కింద నెలకు రూ.50 వేల ఆర్థిక ప్రోత్సాహం అందించడంతో పాటు, విదేశాల్లో శిక్షణ పొందేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ప్రధాని తెలిపారు. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్ లో రాణించడంతో పాటు 2030 కామన్వెల్త్ గేమ్స్, 2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడమే ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభను వెలికితీయడానికి విస్తృతంగా 'టాలెంట్ హంట్' నిర్వహిస్తామని చెప్పారు. క్రీడాకారులు తమ పాఠశాలలకు, గ్రామాలకు వెళ్లి అక్కడి చిన్నారుల్లో స్ఫూర్తి నింపాలని ఆయన పిలుపునిచ్చారు. క్రీడా స్ఫూర్తి జీవితంలో ఎదురయ్యే ఏ సవాలునైనా ధైర్యంగా ఎదుర్కొనేలా మనిషిని తీర్చిదిద్దుతుందని అభిప్రాయపడ్డారు. "ఆడేవాడే ఎదుగుతాడు" అనే తన సూత్రాన్ని పునరుద్ఘాటిస్తూ, "వికసిత భారత్" లక్ష్య సాధనలో క్రీడారంగం కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని పేర్కొన్నారు.

# మహిళా శక్తికి వేదికగా సరస్ మేళా

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి ఆయన గురువారం లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకు 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించారు. దసరా శరన్నవరాత్రుల వేళ ఇంద్రకీలాద్రి సాక్షిగా ఈ మేళా నిర్వహించడం నగరానికి మరింత శోభను తెచ్చిందన్నారు. మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించి, ఎన్నో సవాళ్లను అధిగమించి దేశ అత్యున్నత పదవిని అలంకరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

రాష్ట్రంలో 1.10 కోట్ల మంది సభ్యులతో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు (డ్వాక్రా) ఉన్నాయని, ఇవి ఏటా రూ.69 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తున్నాయని చంద్రబాబు వివరించారు. నిన్నటి పొదుపు సంఘాలు నేడు వ్యాపార సంస్థలుగా రూపాంతరం చెందుతున్నాయని, భవిష్యత్తులో అంతర్జాతీయ బ్రాండ్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ మేళాలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 650 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని, ఇది కేవలం ప్రదర్శన కాదని, గ్రామీణ ఉత్పత్తులకు ఏడాది పొడవునా మార్కెటింగ్ అవకాశాలు కల్పించే దిశగా తొలి అడుగని పేర్కొన్నారు. తమ అనుభవాలను పంచుకుంటూ, కొత్త వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని మహిళలకు సూచించారు.




**సాంకేతికతతో ప్రపంచ మార్కెట్‌కు..**

'స్వయం ఏపీ' బ్రాండ్ ఉత్పత్తులను ఈ-కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికల ద్వారా ప్రపంచ మార్కెట్‌కు పరిచయం చేస్తామని చంద్రబాబు తెలిపారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మహిళల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకున్నప్పుడే 'వికసిత్ భారత్' లక్ష్యం సాధ్యమవుతుందని అన్నారు. మహిళల భద్రత, ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిస్తూనే, వారి ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి స్వయం సహాయక సంఘం ఒక ఆర్థిక శక్తిగా, ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా, ప్రతి గ్రామం ఒక ఉపాధి కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వంగలపూడి అనిత తదితరులు పాల్గొన్నారు.

# 17 రాష్ట్రాల్లో స్పెషల్ సమ్మరీ రివిజన్

(మొదటి పేజీ తరువాయి)

17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాకు "స్పెషల్ సమ్మరీ రివిజన్" (ఎస్ఎస్ఆర్) చేపట్టాలని గురువారం ఆదేశాలు జారీ చేసింది. కొత్తగా ఓటు హక్కు పొందే యువతతో పాటు, సాంకేతిక కారణాల వల్ల జాబితాలో పేర్లు నమోదు కాని వారిని చేర్చేందుకు ఈ ప్రక్రియ దోహదపడనుంది.

పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, బీహార్, తమిళనాడు వంటి కీలక రాష్ట్రాలు ఈ జాబితాలో ఉన్నాయి. 2027 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. తాజా షెడ్యూల్ ప్రకారం, నవంబర్ 12న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం 2027 జనవరి 4న తుది జాబితాను విడుదల చేస్తారు. కాగా, 2027 ఫిబ్రవరి నాటికి ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ ప్రక్రియ ప్రాధాన్యత సంతరించుకుంది.

**వివాదానికి దారితీసిన సర్**

'సర్' ప్రక్రియలో భాగంగా భారీస్థాయిలో ఓటర్ల పేర్లను తొలగించడంపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా, ఫారం-6తో పాటు ఓటర్లు ఒక అదనపు డిక్లరేషన్ సమర్పించాలన్న నిబంధన వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. సుమారు 20 ఏళ్ల క్రితం జరిగిన 'సర్' వివరాలతో ప్రస్తుత దరఖాస్తుదారుల తల్లిదండ్రుల వివరాలను అనుసంధానం చేయాలని కోరడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ నిబంధనలు అసంబద్ధంగా ఉన్నాయని, ఓటర్లను ఇబ్బందులకు గురిచేసేలా ఉన్నాయని ఆరోపిస్తున్నాయి. ఈ వివాదం నేపథ్యంలో 'ఇండియా' కూటమి పార్టీలు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వంటి యువజన సంఘాలు ఢిల్లీలో నిరసనలు చేపట్టాయి. తక్షణమే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**ఏపీ, తెలంగాణలో పరిస్థితి ఏంటి?**

ప్రస్తుతం 'సర్' ప్రక్రియ కొనసాగుతున్న లేదా ఇటీవలే పూర్తయిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో 'ఎస్ఎస్ఆర్' షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అదేవిధంగా, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఇప్పటివరకు 'సర్' ప్రారంభం కాని హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లలో కూడా ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను తగిన సమయంలో వెల్లడిస్తామని ఈసీ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. సెప్టెంబర్ 29న ఇచ్చిన ఆదేశాల మేరకు, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని రాష్ట్రాల అధికారులకు సూచించినట్లు ఈసీ గుర్తు చేసింది.

# వైసీపీ సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

**7 కార్పొరేషన్లకు మేయర్ అభ్యర్థులు వీరే:**

వైసీపీ ప్రకటించిన జాబితా ప్రకారం, ఏడు కీలక నగర పాలక సంస్థలకు మేయర్ అభ్యర్థులను ఖరారు చేశారు.

విజయనగరం (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): కోలగట్ల శ్రావణి (వైశ్య)

విశాఖపట్నం (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): వరుదు కల్యాణి (కాపు వెలమ)

ఏలూరు (బీసీ): గంటా మోహన్ రావు (తూర్పు కాపు)

మచిలీపట్నం (బీసీ – మహిళ): లంకా జ్యోతి (తూర్పు కాపు)

ఒంగోలు (అన్‌రిజర్వ్‌డ్): కుప్పం ప్రసాద్ (వైశ్య)

నెల్లూరు (అన్‌రిజర్వ్‌డ్): ఆనం విజయ్ కుమార్ రెడ్డి (రెడ్డి)

కడప (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): బండి దీప్తిరెడ్డి (రెడ్డి)

**మున్సిపాలిటీలు, నగర పంచాయతీల చైర్మన్ అభ్యర్థులు:**

రాష్ట్రవ్యాప్తంగా 14 మున్సిపాలిటీలు, 6 నగర పంచాయతీలకు ఛైర్మన్ అభ్యర్థులను పార్టీ అధిష్ఠానం ప్రకటించింది.

**మున్సిపల్ చైర్మన్ అభ్యర్థుల జాబితా:**

ఇచ్ఛాపురం (బీసీ – మహిళ): పిలక రాజ్యలక్ష్మి (రెడ్డిక)

పలాస-కాశీబుగ్గ (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): తలసు శ్రీ పద్మ (కళింగ వైశ్య)

నర్సీపట్నం (బీసీ – మహిళ): చింతకాయల అనిత (కాపు వెలమ)

యలమంచిలి (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): బొద్దపు తులసి (కాపు)

తుని (బీసీ – మహిళ): పిట్ట రామ తులసి (శెట్టిబలిజ)

కొవ్వూరు (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): మన్నె పద్మ (కమ్మ)

రామచంద్రాపురం (బీసీ): చింతపల్లి నాగేశ్వరరావు (శెట్టిబలిజ)

కొండపల్లి (ఎస్సీ – మహిళ): నల్లమోతు తేజస్విని (మాదిగ)

తెనాలి (అన్‌రిజర్వ్‌డ్): మద్దాలి శేషాచలం (వైశ్య)

చీరాల (ఎస్సీ – మహిళ): డాక్టర్ ఇస్తార్ల షెర్లీ (మాల)

బద్వేల్ (అన్‌రిజర్వ్‌డ్): రాచపూడి వెంకట సాయి కృష్ణ (వైశ్య)

ప్రొద్దుటూరు (అన్‌రిజర్వ్‌డ్): పొర్రెడ్డి నరసింహారెడ్డి (రెడ్డి)

పులివెందుల (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): వైయస్ ప్రమీలమ్మ (రెడ్డి)

మదనపల్లె (బీసీ): జింకా చలపతి (బోయ)

**నగర పంచాయతీ చైర్మన్ అభ్యర్థులు:**

యలేశ్వరం (ఎస్సీ – మహిళ): బదిరెడ్డి ఆశాలత (మాదిగ)

వుయ్యూరు (ఎస్సీ): పైడముక్కల దివ్య (మాదిగ)

గురజాల (అన్‌రిజర్వ్‌డ్): పోలు వీరారెడ్డి (రెడ్డి)

కనిగిరి (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): పులి శాంతి రెడ్డి (రెడ్డి)

బుచ్చిరెడ్డిపాలెం (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): షేక్ షకీలా బేగం (ముస్లిం)

కమలాపురం (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): మార్జుల కవిత (రెడ్డి)

పార్టీ విడుదల చేసిన ఈ జాబితాలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించారు. మొత్తం 27 స్థానాల్లో 14 స్థానాలు మహిళలకే కేటాయించడం విశేషం. అదేవిధంగా, బీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు కూడా గణనీయమైన సంఖ్యలో అవకాశాలు ఇచ్చారు. ఈ ప్రకటనతో ఆయా నగరాలు, పట్టణాల్లో ఎన్నికల సందడి అధికారికంగా మొదలైంది. పార్టీ ప్రకటించిన అభ్యర్థులు త్వరలోనే నామినేషన్లు దాఖలు చేసి, ప్రచార బరిలోకి దిగనున్నారు.

## ఎల్ నినోతో నీటి సంక్షోభం

(మొదటి పేజీ తరువాయి)

అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఎల్ నినో పరిస్థితులపై మంత్రులతో సమీక్ష నిర్వహించిన అనంతరం మీడియా సమావేశంలో ఆయన ఈ కీలక వివరాలను వెల్లడించారు. గతేడాది ఇదే సమయానికి రాష్ట్రంలోని జలాశయాల్లో 400 టీఎంసీలకు పైగా నీటి నిల్వలు ఉండగా, ప్రస్తుతం అవి కేవలం 209 టీఎంసీలకు పరిమితమయ్యాయని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అందుబాటులో ఉన్న ఈ స్వల్ప జలాలను అత్యంత పొదుపుగా వాడుకోవాలని, తాగునీటి అవసరాలకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు.వచ్చే ఎనిమిది నెలల కాలం అత్యంత కీలకమని, ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వినియోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రైతాంగం పరిస్థితులను అర్థం చేసుకుని సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. యాసంగి సీజన్‌లో వరి సాగును పక్కనపెట్టి, తక్కువ నీటి వినియోగంతో పండే ఆరుతడి పంటలకే మొగ్గు చూపాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా రైతులు ఈ త్యాగానికి సిద్ధపడాలని, ఒక సీజన్ పాటు వరి సాగును వాయిదా వేసుకోవాలని విన్నవించారు. మరోవైపు, తీవ్రమైన ఉష్ణోగ్రతల కారణంగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం అసాధారణ స్థాయికి చేరిందని రేవంత్ రెడ్డి తెలిపారు. సగటు డిమాండ్‌కు అదనంగా మరో 5,000 మెగావాట్ల భారం పడుతోందని, అక్టోబర్ నెలలో ఈ స్థాయిలో విద్యుత్ వాడకం జరగడం గతంలో ఎన్నడూ లేదని వివరించారు. మార్కెట్‌లో ఎంత వ్యయానికైనా విద్యుత్‌ను కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నామని, అదనపు విద్యుత్ కేటాయింపుల కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని వెల్లడించారు. ఎల్ నినో సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు కేంద్రం అండగా నిలవాలని, కేంద్ర ప్రాయోజిత పథకాలలో కేంద్రం వాటాను పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా

(మొదటి పేజీ తరువాయి)

కమీషన్ డిమాండ్ చేస్తోందని, ఇది అవినీతి పరాకాష్ఠ అని ఆయన తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కేవలం సొంత ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని ధ్వజమెత్తారు.తన ఆరోపణలకు బలం చేకూరుస్తూ, ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఎండీ 2026 అక్టోబర్ 13న రాసినట్లు చెబుతున్న ఒక లేఖను కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) రేడియల్ రోడ్-2 టెండర్ల ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. సుశీ ఇన్‌ఫ్రా వంటి అర్హత కలిగిన సంస్థలను ఉద్దేశపూర్వకంగా అనర్హులుగా ప్రకటించి, ప్రభుత్వ పెద్దలకు అనుకూలమైన సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని ఆయన పేర్కొన్నారు.ముడుపులు చెల్లించిన తర్వాతే బిల్లులు విడుదల చేస్తున్నారని, ఈ కమీషన్ల దందా వల్లే అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, కేవలం వ్యక్తిగత లాభం, దోపిడీపైనే దృష్టి సారించిందని మండిపడ్డారు.

## న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు

(మొదటి పేజీ తరువాయి) ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ర×=) ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్ణయాలను సవాల్ చేస్తూ రాహుల్ గాంధీతోపాటు ఇండియా కూటమి నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్, మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. అయితే, నోటీసులు జారీ చేసినంత మాత్రాన రాజకీయ నాయకుల ప్రవర్తనను సమర్థించినట్లు కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**న్యాయస్థానంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు సరికాదు..**

విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, న్యాయవాది గౌరవ్ భాటియా సుప్రీంకోర్టు ప్రాంగణంలో ఇండియా కూటమి చేపట్టిన నిరసన అంశాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్.. 'న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు' అని వ్యాఖ్యానించారు. నిరసన ప్రదర్శన ద్వారా న్యాయస్థానంపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నించారన్న వాదనపై స్పందిస్తూ.. అవన్నీ బలహీనమైన ప్రయత్నాలేనని పేర్కొన్నారు. బయట రాజకీయ నాయకులు చేసే ప్రకటనలను తాము గమనిస్తూనే ఉన్నామని, సమాజంలో జరుగుతున్న పరిణామాలు తెలియకుండా తాము లేమని వ్యాఖ్యానించారు.

**రాహుల్ గాంధీ, అఖిలేశ్‌కు నోటీసులు..**

సుప్రీంకోర్టు వరకు నిరసన ప్రదర్శన చేపట్టడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌పై కూడా ధర్మాసనం విచారణ జరిపింది. ఈ వ్యవహారంలో రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తోపాటు ఇతర నేతలకు నోటీసులు జారీ చేసింది. అక్టోబరు 12న ఇండియా కూటమి చేపట్టిన నిరసన సందర్భంగా సుప్రీంకోర్టు ప్రాంగణంలో రికార్డైన సీసీటీవీ దృశ్యాలను భద్రపరచాలని ఆదేశించింది. కాగా, సోమవారం నాడు రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి నాయకులు ఢిల్లీలోని బారాఖంబా రోడ్ నుంచి సుప్రీంకోర్టు వరకు నిరసన ప్రదర్శన నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనడంతో సుప్రీంకోర్టు ప్రాంగణంలో భారీగా జనం గుమిగూడారు.

**ఎన్నికల సంఘం నిర్ణయాలపై ఇండియా కూటమి పిటిషన్..**

ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలను సవాల్ చేస్తూ విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగత రాయ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, ఎన్సీపీ (ఎస్పీ) నేత సుప్రియా సూలే, శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్, సీపీఐ నేత డి.రాజా, జేఎంఎం నేత మహువా మాఝీ, సీపీఎం నేత ఎం.ఏ.బేబీ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నేత ఈటీ మహమ్మద్ బషీర్ పిటిషన్ దాఖలు చేశారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన అన్ని రికార్డులను సమర్పించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు.

## వాజేడు సబ్‌స్టేషన్‌లో సిజిఆర్ఎఫ్ సమావేశం



**వాజేడు,అక్టోబర్ 16,(ప్రజావినికిడి):**
గురువారం వాజేడు వెంకటాపురం మండలాలకు సంబంధించి విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వాజేడు సబ్‌స్టేషన్‌లో సిజిఆర్ఎఫ్, సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో రైతులు, ప్రజాప్రతినిధులు తమ సమస్యలను సిజిఆర్ఎఫ్, చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో ప్రధానంగా చర్చించిన అంశాలు జగన్నాధపురం, ధర్మారం గ్రామాల రైతుల విజ్ఞప్తి మిర్చి,వరి పంటలు సాగు చేస్తున్న రైతులు వ్యవసాయ అవసరాల దృష్ట్యా రాత్రి సమయంలో అదనంగా రెండు గంటల పాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని చైర్‌పర్సన్ని కోరారు. వెంకటాపురం గ్రామ పంచాయతీ సమస్యలు వెంకటాపురం సర్పంచ్, పుష్కర్ ఘాట్ స్మశాన వాటిక వద్ద విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని దరఖాస్తు సమర్పించారు. కొంగల గ్రామ పంచాయతీ సమస్య:గ్రామ పంచాయతీ మోటారు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉండటం వల్ల తరచూ ఫ్యూజులు పోతూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని కొంగల సర్పంచ్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు.

**సిజిఆర్ఎఫ్ చైర్‌పర్సన్ ఆదేశాల మేరకు** సమస్యలపై తక్షణమే స్పందించిన చైర్‌పర్సన్, వాజేడు ఎఈ, ఎడిఈ,లకు క్రింది ఆదేశాలు జారీ చేశారు. ఓవర్‌లోడ్‌తో ఇబ్బందులు ఎదురవుతున్న ట్రాన్స్‌ఫార్మర్లకు అదనపు సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లను వారం రోజుల్లోగా ఏర్పాటు చేయాలి.గ్రామ పంచాయతీల ఆర్ డల్యూ ఎస్,గ్రామీణ నీటి సరఫరా మోటార్ల కోసం ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో ములుగు ఎస్ఈ బిక్షపతి,ఎస్ఎఓ, ఎడిఈ,లు వెంకటాపురం, వాజేడు మండలాల రైతులు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## దుర్గామాత మండపాల్లో బీఆర్ఎస్ నాయకుల ప్రత్యేక పూజలు





**రాజేంద్రనగర్, (ప్రజావినికిడి): అక్టోబర్15,** రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలర్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని వాంబే కాలనీ,ఆర్‌జేకే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గామాత అమ్మవారి మండపాలను బీఆర్ఎస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,లోక కల్యాణం కోసం ప్రార్థించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కోలన్ సుభాష్ రెడ్డి, మైలర్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు గుమ్మడి కుమార్, సీనియర్ నాయకుడు రమేష్ ముదిరాజ్, కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరితో పాటు రామస్వామి, సునీల్,అశోక్ కుమార్,మధు చారి,బొంబాయి రవి,రిషి, లక్ష్మణ్,ప్రవీణ్, నరేష్ తదితర నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వెంకటాపురం, వాజేడు మండలాలకు కాంగ్రెస్ పార్టీ కొత్త అధ్యక్షులు



**వాజేడు,అక్టోబర్ 16,(ప్రజావినికిడి):**
ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి & స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సూచనల మేరకు,గురువారం ములుగు జిల్లా లోని వెంకటాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా సయ్యద్ హుసేన్ వాజేడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కాకర్లపూడి విక్రాంత్ ని ప్రకటించిన ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇకనుండి పార్టీ కార్యకర్తలకు, అండగా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లే విదంగా చూడాలని చెప్పారు.

## రుద్ర కాలనీ కమిటీ హాల్‌కు నిధులు మంజూరు చేయాలి

### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు కాలనీవాసుల వినతి



**రాజేంద్రనగర్, (ప్రజావినికిడి): అక్టోబర్ 15,** రుద్ర కాలనీలో కమిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వై. ప్రణయ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు గురువారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కమిటీ హాల్ నిర్మాణం స్థలం అందుబాటులో లేక గతంలో నిలిచిపోయిందని ప్రస్తుతం స్థలం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కాలనీలో సమావేశాలు, సామాజిక కార్యక్రమాల నిర్వహణకు కమిటీ హాల్ అవసరమని పేర్కొంటూ, నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని కోరారు.వినతిపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సానుకూలంగా స్పందించి, నిర్మాణానికి సంబంధించి త్వరలో తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సంజయ్ యాదవ్,మాజీ ఎంపీటీసీ జ్ఞానేశ్వర్ యాదవ్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.శ్రీకాంత్ యాదవ్, ఉపాధ్యక్షుడు ప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# లంచం కొట్టు.. విద్యుత్ మీటర్లు పెట్టు..

**ప్రభుత్వ భూముల కబ్జాలకు విద్యుత్ కనెక్షన్ల అండనా.?**

**నోటరీ పేపర్లు ఉంటే చాలు.. మీటర్ జారీకి గ్రీన్ సిగ్నలా.?**

**ఒక్కో మీటర్‌కు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూళ్లంటూ ఆరోపణలు..**

**లైన్‌మెన్ నుంచి డీఈ వరకు అధికారుల పాత్రపై అనుమానాలు..**

**ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ యంత్రాంగం మౌనం ఎందుకు.?**



**కుషాయిగూడ, (ప్రజావినికిడి):**
జవహర్ నగర్ పరిధిలో విద్యుత్ మీటర్ల జారీ వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న స్థలాలకు భారీగా లంచాలు తీసుకొని విద్యుత్ మీటర్లు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. ప్రభుత్వ భూమిపై హక్కును నిర్ధారించే రిజిస్ట్రేషన్ పట్టాలు లేకపోయినా, బాండ్ పేపర్లపై నోటరీ చేయించిన పత్రాలను ఆధారంగా చేసుకుని విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు ఈ మీటర్ల జారీకి అధికారులు అనుసరిస్తున్న నిబంధనలు ఏమిటి.? ఏ ప్రాతిపదికన అనుమతులు ఇస్తున్నారు.? నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తున్నారా.? లేక అక్రమాలకు తెరలేపుతున్నారా.? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఈ వ్యవహారంలో డిఈ హస్తము ఉన్నట్టు ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు.

### నోటరీ పేపర్లకే ఇంత విలువా.?

ప్రభుత్వ భూములకు సంబంధించి చట్టబద్ధమైన హక్కులు(పట్టా) నిర్ధారించే పత్రాలు లేకుండానే నోటరీ పత్రాల ఆధారంగా విద్యుత్ మీటర్లు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. బాండ్ పేపర్‌పై నోటరీ చేయించుకుంటే చాలు.. విద్యుత్ మీటర్ పొందవచ్చా.? నోటరీ పత్రం ఒక స్థలంపై యాజమాన్య హక్కును కల్పిస్తుందా.? ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందా లేదా అనే అంశాన్ని పరిశీలించకుండానే కనెక్షన్లు మంజూరు చేస్తున్నారా.? అన్నది తేలాల్సి ఉంది. అక్రమంగా విద్యుత్ మీటర్లు జారీ చేయడం వెనక ఎంత మొత్తంలో చేతులు మారాయో పూర్తిస్థాయిలో విజిలెన్స్ విచారణ చేయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యుత్ కనెక్షన్ మంజూరు చేసుకున్న వాళ్లు ఒక్కటే భూమిపై యాజమాన్య హక్కును పొందినట్టు ఎక్కడ నిర్ధారించదు. అయినప్పటికీ కనెక్షన్ల జారీ ప్రక్రియను ఆసరాగా చేసుకుని ఆక్రమణదారులు తమ స్థలాలపై హక్కు ఉన్నట్లు ప్రచారం చేసుకునే పరిస్థితి ఏర్పడుతోందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఏ ఈ, ఏడీఈ, డిఈ అధికారులు ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలిస్తున్నారా లేదా అన్నది ఉన్నతాధికారులే స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. గత 15 సంవత్సరాలుగా మీటర్ల జారీపై ఆర్.టి.ఐ సమాచారం సేకరించి వాస్తవాలను తెలుగులోకి తేవాలని స్వచ్ఛంద సంస్థలు కోరుతున్నాయి.

### ఒక్కో మీటర్‌కు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకా.?

జవహర్ నగర్ పరిధిలో విద్యుత్ మీటర్ల జారీ వ్యవహారంలో భారీగా అక్రమ వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు మరింత సంచలనం సృష్టిస్తున్నాయి. ఒక్కో మీటర్ మంజూరుకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు లైన్‌మెన్, ఏఈలు కలిసి అక్రమంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో లైన్‌మెన్ నుంచి ఏఈ, ఏడీఈ, డీఈ స్థాయి అధికారుల వరకు కొందరి పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

భారీ స్థాయిలో మీటర్ల మంజూరు వెనుక ఎవరైనా మధ్యవర్తుల ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నారా.? ఇప్పటివరకు ఎన్ని మీటర్లు మంజూరయ్యాయి.? వాటిలో ఎన్ని ప్రభుత్వ భూములు లేదా వివాదాస్పద స్థలాలకు సంబంధించినవి.? దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి పత్రాలను ప్రామాణికంగా తీసుకున్నారు.? అనే అంశాలపై స్టేట్ విజిలెన్స్ అధికారులచే సమగ్ర విచారణ జరగాల్సి ఉంది. ఇప్పటికే ఈ వ్యవహారంలో విద్యుత్ శాఖ సిబ్బంది, అధికారులు భారీగా అక్రమ సంపాదన కూడబెట్టారంటూ వినిపిస్తున్న ఆరోపణలపైనా ఏసీబీ అధికారులు వచ్చి పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### కబ్జాలు ఒకవైపు.. కనెక్షన్లు మరోవైపు

ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ యంత్రాంగం ఒకవైపు ఆక్రమణలను అడ్డుకోవాల్సి ఉండగా, మరోవైపు ఆ భూముల్లో నిర్మాణాలకు విద్యుత్ కనెక్షన్లు ఎలా మంజూరవుతున్నాయన్నది కీలక ప్రశ్నగా మారింది. ప్రభుత్వ భూములపై ఆక్రమణల ఆరోపణలు ఉన్నప్పుడు రెవిన్యూ, విద్యుత్ శాఖ ల అధికారులు సమన్వయంతో పరిశీలన చేపట్టాల్సిన అవసరం లేదా.? తహసీల్దార్, ఆర్డీవో, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై దృష్టి సారించారా.? ఆక్రమణలపై ఫిర్యాదులు అందినా చర్యలు తీసుకోలేదా.? ఎందుకు తీసుకోలేదన్న ప్రశ్నలకు సమాధానాలు అధికారులు సమాధానం చెప్పాలని స్థానికుల డిమాండ్ చేస్తున్నారు.



### అధికారుల మౌనం.. అక్రమార్కులకు అండనా.?

ప్రభుత్వ భూముల పరిరక్షణ, విద్యుత్ మీటర్ల జారీ ప్రక్రియలో పారదర్శకత కోసం ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. నోటరీ పత్రాల ఆధారంగా మంజూరైన కనెక్షన్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన మీటర్లు ఉన్నాయా లేదా నిర్ధారించాలి. కబ్జా స్థలాలలో నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన మీటర్లను వెంటనే రద్దు చేసి ప్రభుత్వం తీసుకోవాలని, అదేవిధంగా భారీగా అక్రమ వసూళ్ల ఆరోపణలపై ఏసీబీ అధికారులచే విచారణ జరిపి బాధ్యులను ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారికి రెవిన్యూ, విద్యుత్, మున్సిపల్ శాఖల అవినీతి అధికారులతో పరోక్షంగా పూర్తి సహకారం అందుతోందన్న అనుమానాలకు తెరదించాల్సిన బాధ్యత విద్యుత్ శాఖతో పాటు రెవెన్యూ, మున్సిపల్ ఉన్నత అధికారులపైన, జిల్లా కలెక్టర్ పైన ఉంది.జవహర్ నగర్‌లో ఎన్ని మీటర్లు నోటరీ పత్రాల ఆధారంగా మంజూరు చేశారు.? వాటికి సంబంధించిన దరఖాస్తులు, పరిశీలన నివేదికలు ఏమిటి.? అక్రమ వసూళ్ల ఆరోపణలపై విచారణ ఎప్పుడు ప్రారంభిస్తారు.? అన్న ప్రశ్నలకు ఉన్నతాధికారులు,జిల్లా కలెక్టర్ సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి జవహర్ నగర్ లో ప్రభుత్వ భూముల కబ్జాల ను పూర్తిస్థాయిలో వెలికితీస్తారా.? లేక ప్రభుత్వ భూముల ఆక్రమణలు, విద్యుత్ మీటర్ల జారీపై జరుగుతున్న అవినీతి అక్రమాలను ప్రోత్సహిస్తారా.? వేచి చూడాలి

# స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో పర్యటించిన

## టీటీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు,పోలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు

**ఉమ్మడి వరంగల్ జిల్లా రఘునాథ్‌పల్లి మండలం మెకలగట్టు గ్రామంలో పర్యటన..**

**గ్రామంలోని సర్వే నెంబర్ 206 లో 110 ఎకరాల అన్యక్రాతమైన భూదానోద్యమ భూముల పరిశీలన..**

**తహసిల్దార్ కు వినతి పత్రం ఇస్తున్న టిడిపి నాయకులు..**



**వరంగల్,(ప్రజావినికిడి):** పార్లమెంటు పరిధిలోని స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో పర్యటించిన టీ,టీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు,పోలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు,స్థానిక వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ విద్య సాగర్ రావు స్థానిక నాయకులతో కలిసి నియోజకవర్గం లోని రఘునాథపల్లి మండలం మేకల గట్టు గ్రామంలో అన్యక్రాతమైన భూములను పరిశీలించారు.

ఈ సందర్భంగా బక్కని నరసింహులు మాట్లాడుతూ, భూదానోద్యమ సమయంలో అచార్య వినోభా భావే పర్యటనలో నెల్లుట్ల కేశవ రావు అనే భూస్వామి మేకలగట్టు గ్రామంలో తనకు ఉన్న 206 లో 110 ఎకరాల ఈ భూములను ధానంగా ఇచ్చారు.1975 సంవత్సరం లో అనాటి ప్రభుత్వం ఈ భూమిని భూములు లేని (44)మంది దళితులకు అసైన్ చేసింది.అప్పటి భూదాన యజ్ఞ బోర్డు పత్రాలను అందజేసింది.

కాని నేడు రేవిన్యూ అదికారుల సహయంతో అక్రమార్కులు ఈ భూములను ప్లాట్లుగా మార్చి వ్యాపారం చేస్తున్నారు.

రేవిన్యూ శాఖ ఉన్నదికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో భూములను సర్వే చేసి తిరిగి దళితులకు ఇచ్చేవిదంగా చర్యలు తీసుకోవాలని,తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు,రాష్ట్ర మాజీ అధ్యక్షులు బక్కని నర్సింహులు డిమాండ్ చేసారు.ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో తెలంగాణాలో నాటి టిడిపి పార్టీ,కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పేదలకు పంచిన భూములను స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన కెసిఆర్ ప్రభుత్వం ధరణి పోర్టల్ ద్వారా పేదల భూములను లాక్కొని పరిశ్రమలకు కట్టబెట్టిందన్నారుగతంలో పేదలకు ఇచ్చిన పొలాలను భూదాన్ చట్టం ద్వారా నాటి ప్రధాని పీవీ నరసింహారావు, కోనేరు రంగారావు కమిషన్ నివేదికల ప్రకారం పేదలకు పంచాలన్నారు.అనంతరం రఘునాథ్ పల్లి మండల తాసిల్దార్ (ఎమ్మార్వో)కి మండలంలోని ఏవైతే సీలింగ్ భూములు,అసైన్డ్ భూములు,భూదాన్ భూముల వివరాలను ఇవ్వాల్సిందిగా (ఆర్టిఐ)చట్టం ద్వారా మెమోరాండం సమర్పించడం జరిగింది. మండలంలో అన్యక్రాతమైన భూములను స్వాధీన పరచుకొని భూమిలేని నిరుపేద ఎస్సీ,ఎస్టీ,బీసీలకు పంచవలసిందిగా టిడిపి పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమం లో రఘునాథ్ పల్లి మండల పార్టీ అధ్యక్షులు బొక్క రామచందర్,తెలుగు యువత ఇబ్రహీంపట్నం అధ్యక్షులు మెట్టు



దామోదర్ రెడ్డి,వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ అర్చన పెళ్లి విద్య సాగర్ రావు టిఎన్ యుఎస్ రాష్ట్ర అధ్యక్షులు ముంజ వెంకట్రాజ్యం,స్టేషన్ ఘనపూర్,లింగాల ఘనపూర్,చిల్పూర్ జఫర్గడ్,మండల పార్టీ అధ్యక్షులు ధర్మారెడ్డి,ఆరూరి రాజు,వక్రధర్ రెడ్డి,మేకల రమేష్,మెట్టు దామోదర్,ఎడ్ల మల్లేష్,నర్సింగరావు,కొమ్మగోని నరసయ్య, మధుసూదన్ , పిన్నింటి మల్లారెడ్డి,జహంగీర్, అక్షిత్,గిరిబాబు,రాజశేఖర్,ఎండి యాకూబ్,తెలుగుదేశం పార్టీ నాయకులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెకు తోకల శ్రీనివాస్ రెడ్డి మద్దతు

## ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి..
## న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి







**రాజేంద్రనగర్, (ప్రజావినికిడి): అక్టోబర్ 15,**
తెలంగాణ రాష్ట్రంలో ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి మద్దతు ప్రకటించారు. గురువారం శంషాబాద్‌లో రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాల ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో పాటు,జీవో 60, 1195 ప్రకారం పెరిగిన వేతనాలను అమలు చేయాలని కోరారు. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న 5 శాతం వార్షిక ఇంక్రిమెంట్,8 శాతం లయబిలిటీ బోనస్‌ను విడుదల చేయాలని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యం వీడి, ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ప్రతినిధులతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సంగీత, దినేష్,శంకర్, సాయికిరణ్, చేతన్,అనూప్, డీహెచ్‌ఓ డాక్టర్ రాము నాయక్, గిరిజన సంఘం అధ్యక్షుడు, స్థానిక నాయకులు బత్కు శ్రీనివాస్ యాదవ్,శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్**



**దిల్‌సుఖ్‌నగర్,(ప్రజావినికిడి):**దిల్‌సుఖ్‌నగర్, గడ్డిఅన్నారం ప్రాంతంలో 26వ అమ్మవారి వార్షికోత్సవం, దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ రాపోలు భాస్కర్, తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నరసయ్య ముఖ్య అతిథులుగా విచ్చేశారు.అరిగే ఐలేష్ కుర్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో రాచకొండ సతీష్, ఎలిమినేటి ప్రవీణ్ గౌడ్, ఎలిమినేటి మధు గౌడ్,ఎలిమినేటి జంగా గౌడ్, చేగూరి శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.అమ్మవారి వార్షికోత్సవం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఉత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ముఖ్య అతిథుల రాకతో నిర్వాహకులు, భక్తుల్లో ఉత్సాహం నెలకొంది.ప్రతి సంవత్సరం అమ్మవారి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ భక్తి భావాన్ని, ఆధ్యాత్మికతను పెంపొందించడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన నిర్వాహకులను అభినందించారు.

# సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా
# ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం




**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.కూకట్‌పల్లి నియోజకవర్గ ఓబీసీ మోర్చా కన్వీనర్ వినోద్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహిస్తూ, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఓబీసీమోర్చా అధ్యక్షులు ఆనంద్గౌడ్,మేడ్చల్-మల్కాజిగిరి అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు జే.కే. శేఖర్ యాదవ్,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు,తెలంగాణ రాష్ట్ర బీజేపీ మున్సిపల్ సెల్ కో-కన్వీనర్ రావుల శేషగిరి ఓబిసి మోర్చ జిల్లా ఇన్చార్జ్ లక్ష్మణ్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీ ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యతని, రహదారి భద్రత మనందరి సామాజిక బాధ్యతని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,మరియు కార్లలో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, ట్రాఫిక్ సిగ్నళ్లను గౌరవించాలని, అతివేగం అలాగే నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, త్రిబుల్ రైడింగ్ చేయొద్దని సూచించారు.ఈ కార్యక్రమం ద్వారా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను తెలియజేస్తూ, సురక్షిత ప్రయాణంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుజాత రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ కర్ణ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సతీష్ గౌడ్ ఉపాధ్యక్షులు యాదగిరిలు, జిల్లా కార్యదర్శులు శ్రీధర్ వర్మ రేణుక రమేష్ నేత, కుత్బుల్లాపూర్ ఓబీసీ కరీంనగర్ శ్రీనివాస్ గౌడ్ నరసింహ చారి జిల్లాస్పోక్ పర్సన్ వినోద్ కుమార్, సబిత యాదవ్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ అనురాధ దేవి,లక్ష్మి విజేత శ్రీదేవి,బిజెపి సీనియర్ నాయకులు కంచి మహేందర్..కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ కైలాపూర్ డివిజన్ అధ్యక్షులు తిరుపతి అసెంబ్లీ కోకనూర్ శివ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బండ్లగూడ లో రూ.4.25 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం

**యుజీడీ,సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శ్రీకారం**





**రాజేంద్రనగర్, (ప్రజావినికిడి): అక్టోబర్ 15,**
నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ బండ్లగూడ, హైదర్షాకోట్ డివిజన్లలో రూ.4.25 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. బండ్లగూడ డివిజన్ 121, హైదర్షాకోట్ డివిజన్ 123 పరిధిలోని కాలనీల్లో యూజీడీ,సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. హైదర్షాకోట్ డివిజన్‌లోని స్నేహిత హిల్స్‌లో రూ.214 లక్షలతో, పద్మావతి కాలనీ ఎ-బ్లాక్‌లో రూ.81.20 లక్షలతో, సి-బ్లాక్‌లో రూ.130 లక్షలతో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ),సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ మూడు ప్రాంతాల్లో కలిపి రూ.425.20 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు.ఈ పనులు పూర్తయితే కాలనీల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగుపడటంతో పాటు రహదారుల సౌకర్యం అందుబాటులోకి రానుంది. దీంతో స్థానిక ప్రజలకు రోజువారీ రాకపోకల్లో ఇబ్బందులు తగ్గి, మౌలిక సదుపాయాలు మెరుగుపడనున్నాయి.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ప్రకృతి ఆరాధనకు ప్రతీక బతుకమ్మ పండుగ..

## ఇంచార్జీ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి ఐఎఎస్.







**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధిస్తూ, మానవాళిని ప్రకృతికి దగ్గర చేసే గొప్ప వేడుక అని ఇంచార్జీ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి అన్నారు.గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) ఆవరణలో మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ,మెప్మా, అడల్ట్ ఎడ్యుకేషన్ తదితర శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఇంచార్జీ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి పాల్గొని పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడి సంబరాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇంచార్జీ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మను అందంగా పేర్చి పూజించడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. మహిళలకు ఎంతో ప్రత్యేకమైన బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రానికే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ పండుగ తెలంగాణ ప్రజల సాంస్కృతిక వైభవాన్ని చాటిచెబుతోందని అన్నారు.మహిళలంతా ఒకచోట చేరి తొమ్మిది రోజులపాటు ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. ప్రకృతిని గౌరవిస్తూ,మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా ప్రతి ఒక్కరూ పండుగలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శాంతిశ్రీ, అడల్ట్ ఎడ్యుకేషన్ అధికారి అనిత, వైద్య ఆరోగ్య శాఖ,మెప్మా, రెవెన్యూ తదితర శాఖలకు చెందిన మహిళా అధికారులు, సిడిపిఒలు,ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి: పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి**



**శంషాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్15,**
పెద్దషాపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి, షాద్‌నగర్ జోన్ డీసీపీ శిరీష, ఏసీపీ లక్ష్మీనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా పెద్ద షాపూర్ పోలీస్‌స్టేషన్ పనితీరును సమీక్షించి,కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పరిష్కారం, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్షించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు సూచించారు. ప్రతి కేసులో దర్యాప్తును వేగవంతం చేస్తూ, వాస్తవాలను సమగ్రంగా పరిశీలించి, చట్టపరమైన ప్రక్రియలను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు.నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టడంతో పాటు,నేరాల నివారణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పెద్దషాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వై. సురేందర్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్, కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు
# స్వీకరించిన చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి







**హైదరాబాద్, (ప్రజావినికిడి):**
గాంధీభవన్‌లోని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి గురువారం రోజు వేదమంత్రోచ్ఛారణలు,పార్టీ శ్రేణుల కోలాహలం మధ్య అత్యంత వైభవంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఈ బాధ్యతల స్వీకార కార్యక్రమానికి గౌరవ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై నూతన అధ్యక్షురాలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడటానికి పారిజాత నర్సింహారెడ్డి నాయకత్వం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వానికి,రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు వి. హనుమంత్ రావు,చల్లా నర్సింహారెడ్డి, పట్నం సునీత మహేందర్ రెడ్డి, తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి, సరితా తిరుపతయ్య, చరణ్ కౌశిక్ యాదవ్, రఘునాథ్ యాదవ్,కాల్వ సుజాత,సామ రామ్మోహన్ రెడ్డి గార్లతో పాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు మరియు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొని నూతన అధ్యక్షురాలిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

**అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ గజ్జల రాంచందర్**
**ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం**



**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, రంగారెడ్డి జిల్లా టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ గజ్జల రాంచందర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్నదానం మహాదానమని, యువత ఇలాంటి సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజంలో సేవాభావాన్ని పెంపొందించేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కార్యదర్శి ఓం ప్రకాష్, ఇంద్రమ్మ కమిటీ సభ్యులు బల్వంత్ రెడ్డి, మీర్‌పేట్ మాజీ ఎంపీపీ సెల్ అధ్యక్షులు బాలరాం తదితర నాయకులు, ఫ్రెండ్స్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## దేవి నవరాత్రి ప్రత్యేక పూజలలో పాల్గొన్న దమ్మని శ్రవణ్ కుమార్



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
జీడిమెట్ల గ్రామం శ్రీ వెంకటేశ్వర శివ వీరాంజనేయ స్వామి ఆలయంలో దేవి చరణ్ నవరాత్రులు పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు దమ్మని శ్రావణ్ కుమార్,ఈ సందర్భంగా ప్రజలందరూ కూడా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సుఖశాంతులతో జీవనం గడిపే విధంగా అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తునికి కృష్ణారావు,ఎస్ శ్యామ్ రావు,పి. రాఘవేంద్రరావు, ఎల్ నాగభూషణం. వీరేష్,వి.అశోక్ గౌడ్,శ్రీనివాస్, స్థానిక కాలనీవాసులు మహిళా సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

## సాయి నగర్ ఆలయ పరిధిలో సిఎంసి నిధులతో రూ.20 లక్షల సీసీ రోడ్డు ప్రారంభం



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రగతి నగర్ 276వ డివిజన్ పరిధిలోని సాయి నగర్ ఆలయ ప్రాంతంలో సిఎంసి నిధులతో రూ.20 లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డును కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిలుగా పాల్గొని ప్రారంభించారు.కాలనీ అభివృద్ధిలో భాగంగా సిఎంసి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతూ, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారు.
ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ, సిఎంసి నిధులతో కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.అనంతరం భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.దేశ యువతకు స్ఫూర్తిగా నిలిచిన కలాం సేవలను, దేశాభివృద్ధికి ఆయన అందించిన కృషిని స్మరించుకున్నారుఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తాతిరెడ్డి),మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్,277వ డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆలేటి శ్రీనివాస్, గజ్జెల కాంతం, కూతురు నిర్మల, ప్రవీణ్ (లడ్డు), మల్లికార్జున్, నవీన్ రెడ్డి, వీరబాబు, సురేందర్ యాదవ్,పిల్లి ఆంజనేయులు, మురళి తదితరులు పాల్గొన్నారు

## ప్రగతి నగర్ 276వ డివిజన్ వాసవి కాలనీలో సిఎంసి నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం

### ప్రజల అవసరాలే ప్రాధాన్యం అభివృద్ధే మా లక్ష్యం:కోలన్ హనుమంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, ప్రగతి నగర్ 276వ డివిజన్ పరిధిలోని వాసవి కాలనీలో సిఎంసి నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు.కాలనీ అభివృద్ధిలో భాగంగా సిఎంసి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత నిస్తూ పలు అభివృద్ధి పనులు చేపట్టారు.ఈ సందర్భంగా సిఎంసి నిధుల నుంచి రూ.17 లక్షలతో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అలాగే రూ.13 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ. 3 లక్షలతో ఇంకుడు గుంత /బోరు సంబంధిత పనులకు శ్రీకారం చుట్టారు.అనంతరం హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, సిఎంసి నిధులతో కాలనీల అభివృద్ధికి కృషి చేస్తూ,ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించే మెరుగుపరచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తాతిరెడ్డి),మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, 277వ డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి,వాసవి కాలనీ అధ్యక్షులు మరియు సీనియర్ నాయకులు మేడ శ్రీనివాస్, నాగేశ్వర్ రావు, సురేందర్ యాదవ్, వీరబాబు,లడ్డు, నవీన్ రెడ్డి,పిల్లి ఆంజనేయులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పి. సాంశివరావు, రమేష్, గూడూరు మురళి,రమేష్ గుప్తా,మహేష్, ఆలేటి శ్రీనివాస్, అమరయ్య, రామరాజు, జగదీష్,వి.నాయేశ్వర్ రావు, భోగేశ్వర్ రావు, మరియు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఎం.ఎన్.రెడ్డి నగర్ లో ప్రత్యేక పూజలు నిర్వహించిన కుంట సిద్ధిరాములు -భారీగా హాజరైన భక్తజనం





**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
దుర్గా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ఎం.ఎన్.రెడ్డి నగర్ లో అమ్మవారికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అలాగే బిఆర్ఎస్ నాయకులు కుంట సిద్ధిరాములు మాట్లాడుతూ, దేవి శరన్నవరాత్రులలో భాగంగా తొమ్మిది రోజులు అమ్మవారికి విశేషంగా అలంకరిస్తూ పూజలు నిర్వహిస్తున్నామని అమ్మవారి కృప కరుణాకటాక్షాలు నియోజకవర్గ ప్రజలందరికీ ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.స్థానిక కాలనీవాసులుభక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుంట సిద్ధిరాములు,పార్టీ నాయకులు, కాలనీవాసులు, మహిళలు, కాలనీ పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## దుర్గామాత మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన రవీందర్ యాదవ్





**షాద్‌నగర్,(ప్రజావినికిడి):**
పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని రవీందర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పండుగల సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్,సర్పంచ్ జెట్ట కుమార్, కౌన్సిలర్లు శారద శేఖర్,వసంత శ్రీనివాస్,మహమ్మద్ ఎజాజ్ (అడ్డు), పిన్నమోని గోపాల్, నాయకులు రవి యాదవ్,బల్లు బాలాజీ,నర్సింగ్, కొండ మల్లేష్, రాఘవేందర్ గౌడ్,మంగ శ్రీశైలం,పవన్ సింగ్,పిట్టల మల్లేష్, రహమత్ అలీ,వినోద్,సాదిఖ్,వెంకటేష్ గుప్తా,విజయ్, శ్రీకాంత్,రాజశేఖర్,శివ,ప్రవీణ్, సతీష్,ఆరె కటిక సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## బండారి లేఔట్ డివిజన్ రాజీవ్ గృహకల్ప వద్ద డా.ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణ



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బండారి లేఔట్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప వద్ద భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరైన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి డా.ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీజే డాక్టర్‌అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించారు.ఆయన జీవితం, ఆశయాలు యువతకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి,బండారి లేఔట్ డివిజన్ అధ్యక్షులు వాసు వరగాని,ప్రగతి నగర్ డివిజన్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తాతిరెడ్డి),మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్,కె. అమృతయ్య, కమిటీ నిర్వాహకులు మొయినుద్దీన్, రఫత్, రామచంద్ర నాయక్,సరిత లక్ష్మణ్,ప్రభాకర్ రెడ్డి,అబ్దుల్లా, నయాబ్, బాలరాజు, ప్రసాద్ గౌడ్, వెంకటేశ్వర్ గౌడ్, శ్యామ్ గౌడ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బి.ఆర్.ఎస్.ఎల్.పివిప్ కేపీ వివేకానంద్,



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని కార్యక్రమాన్ని పురస్కరించుకొని,బాచుపల్లి పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌లో మహమ్మద్ సలీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, డాక్టర్ అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని,సాధారణ కుటుంబంలో జన్మించి తన అసాధారణ ప్రతిభ,కఠోర శ్రమ, అంకితభావంతో దేశ అత్యున్నత పదవిని అధిరోహించిన మహనీయుడని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత కలలు కనాలని,ఆ కలలను సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని కలాం ఇచ్చిన గొప్ప సందేశం నేటికీ ఎంతో ప్రాసంగికమని తెలిపారు.దేశ రక్షణ,శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి విశేష సేవలందించిన అబ్దుల్ కలాం ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, విద్యార్థులు అలాగే యువత ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ మాజీ కార్పొరేటర్ ధనరాజ్ యాదవ్,పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద, బోరంపేట్ పాక్స్ చైర్మన్ మిద్దెల బాల రెడ్డి, కొంపల్లి మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ కార్పొరేటర్లు ఆగం రాజు, బాలాజీ నాయక్, గాజుల సుజాత, కోఆప్షన్ సభ్యుడు చంద్రగిరి సతీష్, నాయకులు సాంబశివ రెడ్డి, ఖాదరయ్య, భిక్షపతి, చంద్రయ్య, ప్రవీణ్, విద్యాసాగర్, రియాజ్, సుకన్య,సువర్ణ, ఎస్.వి.సురేందర్ రెడ్డి,కమిటీ సభ్యులు రమేష్, తిరుపతి, మోహన్,సురేష్, కృష్ణ,చోటు, సోహైల్,ఫజల్, పర్వేజ్,మరియు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు కాలనీ కోట మైసమ్మ ఆలయంలో వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు..

### ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి దంపతుల ప్రత్యేక పూజ, హోమం,అర్చనలు..భక్తులకు అన్నదానం







**షాద్‌నగర్,(ప్రజావినికిడి):**
దేవీ నవరాత్రుల సందర్భంగా పట్టణంలోని రైతు కాలనీలో గల కోట మైసమ్మ ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో సందడిగా మారగా,అమ్మవారి నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

**శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారి దర్శనం**
దేవీ నవరాత్రుల్లో ప్రతి రోజూ అమ్మవారిని ఒక్కో రూపంలో అలంకరించి పూజించడం విశేషం.ఇందులో భాగంగా ఐదవ రోజు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారుభక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలుస్తూ కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని,ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ప్రార్థించారు.

**ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి దంపతుల ప్రత్యేక పూజలు**
రైతు కాలనీ కోట మైసమ్మ ఆలయంలో దేవీ నవరాత్రుల సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.అమ్మవారి సన్నిధిలో సంప్రదాయబద్ధంగా హోమం నిర్వహించడంతో పాటు ప్రత్యేక అర్చనలు చేశారు.భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించి ఆశీస్సులు పొందారు. నవరాత్రుల సందర్భంగా ఆలయంలో నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాలు భక్తులలో భక్తిభావాన్ని మరింత పెంపొందిస్తున్నాయి.

**భక్తులకు అన్నదాన కార్యక్రమం**
దేవీ నవరాత్రుల సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. భక్తులకు అన్నదానం చేయడం ద్వారా సేవాభావాన్ని చాటుకున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నదానం నిర్వహించడం పట్ల భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

**భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు**
దేవీ నవరాత్రుల నేపథ్యంలో రైతు కాలనీ కోట మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.నవరాత్రుల ప్రతి రోజూ అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజించడం ద్వారా భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతున్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరికీ మేలు జరగాలని,సమాజంలో సుఖశాంతులు నెలకొనాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.రైతు కాలనీ కోట మైసమ్మ ఆలయంలో నిర్వహించిన దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికత,సేవాభావానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బీరంగూడ జగన్మోహన్ రెడ్డి మాజీ పిఏసిఎస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి,మాజీ కౌన్సిలర్లు చింటూ ప్రతాప్ రెడ్డి,ప్రేమలత యుగేందర్,పాలమాకుల చెన్నయ్య,పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,మాజీ సర్పంచ్లు తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి,యారం శేఖర్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ కాట్న రవీందర్,కాంటెస్టెడ్ కౌన్సిలర్స్ చేరుకు శివ,సలీం,నాయకులు రాందాస్,దినేష్ సాగర్, బుచ్చయ్య నాయక్,ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులను ఆకాంక్షను గౌరవిస్తూన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు

### మాజీ జెడ్పీటీసీ పి. వెంకట్ రాంరెడ్డి



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**తెలంగాణ ఉద్యమ కారులు తమ ఉద్యమ సమయంలో ఉన్నటువంటి వివరాలని తెలంగాణ ఉద్యమకారుల వెబ్ సైట్ లో అప్లోడ్ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను.ఎవరైతే ఉద్యమంలో అరెస్ట్ అయినరో, జైలుకుపోయినరో ఉద్యమం చేసినారో గాయపడినరో వారందరూ కూడా అప్లై చేసుకోవాల్సిందిగా కోరుతున్నా మనకు గొప్ప అవకాశం ఇచ్చిన టువంటి సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు,అలాగే తెలంగాణ ఉద్యమ కారుల కోసం గొప్ప అవకాశం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ,షాద్ నగర్ తెలంగాణ ఉద్యమ కారుల ఆధ్వర్యంలో నేటి సాయంత్రం 5 ఐదు గంటలకు స్థానిక తెలంగాణ అమరవీరుల స్థూపం నుండి చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ ఉంటుంది కావున తెలంగాణ ఉద్యమ కారులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

## మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకున్న ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాసరెడ్డి



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
నిజాంపేట్ సర్కిల్ నిజాంపేట గ్రామంలో వెలిసినటువంటి కనకదుర్గమ్మ ఆలయంలో ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రులలో భాగంగా అమ్మవారు ఐదవ రోజు మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. మహాలక్ష్మి అవతారంలో ఉన్న అమ్మవారిని ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి దర్శించుకొని చండీ హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సత్యం పంతులు అమ్మవారి శేష వస్త్రంతో వారిని సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేసి నిండు నూరేళ్లు అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలతో ఉండాలని దీవించారు. అనంతరం కొలన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలందరూ అమ్మవారి ఆశీస్సులతో సంతోషంగా, సుఖశాంతులతో ఉండాలని కోరారు.ఆలయ ప్రధానార్చకులు మాట్లాడుతూ, దేవీ నవరాత్రులలో భాగంగా 5వ రోజు కనకదుర్గమ్మ అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో దర్శనం ఇచ్చారని అమ్మవారిని దర్శించుకుంటే అష్టైశ్వర్యాలు, భోగభాగ్యములు,ఉద్యోగ, వ్యాపారంలో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు.దేవి నవరాత్రులలో భాగంగా ప్రతిరోజు ఆలయ సమీపంలో తొమ్మిది రోజులు నిత్యఅన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నిజాంపేట గ్రామ ప్రజలు భక్తులు దుర్గామాత మాలధారణ వారు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

## పాట్నా ఆల్ ఇండియా బ్యాడ్మింటన్ టోర్నీలో మ్యాచ్ పాయింట్ క్రీడాకారిణుల సత్తా..

**మెయిన్ డ్రాకు అర్హత సాధించిన భవనాసి సాన్వి, దేవరం శ్రీనిధి, లట్టాల సాన్వి..**




**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** బీహార్‌లోని పాట్నాలో అక్టోబర్ 10 నుంచి 15 వరకు నిర్వహించిన అండర్-13 ఆల్ ఇండియా బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారిణులు ప్రతిభ కనబరిచారు. భవనాసి సాన్వి, దేవరం శ్రీనిధి బాలికల డబుల్స్ విభాగంలో మెయిన్ డ్రాకు అర్హత సాధించగా, లట్టాల సాన్వి సింగిల్స్,డబుల్స్ రెండు విభాగాల్లోనూ మెయిన్ డ్రాలో స్థానం సంపాదించింది.బాలికల డబుల్స్ విభాగంలో భవనాసి సాన్వి, దేవరం శ్రీనిధి జోడీ ఉత్కంఠభరిత పోరులో విజయం సాధించింది. ఏ-జోన్ అకాడమీకి చెందిన పెన్నేరు మన్విత, గోపీచంద్ అకాడమీకి చెందిన కన్విక వంకదారు జోడీతో తలపడిన మ్యాచ్ పాయింట్ క్రీడాకారిణులు తొలి సెట్‌ను 15-11తో గెలిచారు.రెండో సెట్‌ను 7-15తో కోల్పోయినప్పటికీ,నిర్ణయాత్మక మూడో సెట్‌లో 15-13తో గెలిచి మెయిన్ డ్రాకు అర్హత సాధించారు.మరో క్రీడాకారిణి లట్టాల సాన్వి బాలికల సింగిల్స్ విభాగంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన అహోనా బెనర్జీపై 15-7, 15-8తో వరుస సెట్లలో విజయం సాధించి మెయిన్ డ్రాలోకి ప్రవేశించింది. డబుల్స్ విభాగంలో టాప్ సీడ్‌గా ఉండటంతో నేరుగా మెయిన్ డ్రాకు అర్హత పొందింది.జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో చిన్న వయసులోనే ప్రతిభ చాటిన క్రీడాకారిణులను మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపకులు, చైర్మన్,ప్రధాన కోచ్ వేణు ముప్పాల అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేలా క్రీడాకారిణులు క్రమశిక్షణతో సాధన కొనసాగించాలని ఆకాంక్షించారు.

## తనీరా 'సోలహ్ శృంగార్' కలెక్షన్ ఆవిష్కరణ



**హైదరాబాద్, (ప్రజా వినికిడి):** టాటా గ్రూప్‌కు చెందిన తనీరా బ్రాండ్ పండుగల సీజన్‌ను పురస్కరించుకుని 'సోలహ్ శృంగార్' పేరుతో ప్రత్యేక చీరల కలెక్షన్‌ను ఆవిష్కరించింది. భారతీయ సంప్రదాయ అలంకరణల స్ఫూర్తితో రూపొందించిన ఈ కలెక్షన్ మహిళల సహజమైన అందం, ఆత్మవిశ్వాసం, వ్యక్తిగత శైలిని ప్రతిబింబిస్తుందని సంస్థ తెలిపింది.సిల్క్, ఆర్గాంజా, టిష్యూ,టస్సర్ వంటి విలాసవంతమైన వస్త్రాలతో పాటు సంప్రదాయ నేత చీరలను ఈ కలెక్షన్‌లో అందుబాటులోకి తీసుకొచ్చింది. సంప్రదాయ కళాత్మకతకు ఆధునిక డిజైన్లను జోడించి ప్రత్యేకంగా రూపొందించినట్లు పేర్కొంది.ఆప్ సే హీ పూరా,హర్ శృంగార్ (మీతోనే ప్రతి శృంగార్ సంపూర్ణం) అనే సందేశంతో రూపొందించిన ఈ ప్రచారం,ప్రతి మహిళ ప్రత్యేకతను చాటిచెబుతోందనీ పేర్కొంది. ప్రచార సమయంలో కొనుగోళ్లు చేసే వినియోగదారులకు దేశవ్యాప్తంగా ఉన్న తనీరా స్టోర్లలో ప్రత్యేక గిఫ్ట్ వోచర్లను అందిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది.

## బార్ల లక్కి డ్రాకు ఏర్పాట్లు పూర్తి..

**హైదరాబాద్, (ప్రజావినికిడి):**టీసీయుఆర్ (తెలంగాణ క్యూర్ అర్బన్ రీజియన్) పరిధిలోని 14 బార్లకు,మిగిలిన కార్పొరేషన్, మునిసిపాలిటీల్లో 27 బార్లకు వచ్చిన దరఖాస్తుల్లో నేడు (శుక్రవారం) జరిగే లక్కిడ్రా ద్వారా బార్ లైసెన్సీలను ఎంపిక కోసం ఎక్సైజ్‌శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. టీసీయుఆర్ పరిధిలోని 14 బార్లకు 4251, కార్పొరేషన్, మునిసిపాలిటీల్లోని 27 బార్లకు 4519 దరఖాస్తులు వచ్చాయి. టీసీయుఆర్‌తో పాటు అన్ని జిల్లాలో 16 శుక్రవారం ఉదయం 11 గంటలకు దరఖాస్తుదారుల సమక్షంలో డ్రా ద్వారా బార్ లైసెన్సీలను ఎంపిక చేస్తారని ఎక్సైజ్ శాఖ పేర్కొంది. టీసీయుఆర్ పరిధిలోని 14 బార్లకు సంబంధించిన లక్కి డ్రాను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ తీస్తారు. మిగిలిన జిల్లాలో ఆయా జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా లక్కి డ్రాలో బార్ లైసెన్సీలను ఎంపిక చేస్తారు. టీసీయుఆర్‌లోని 14 బార్లకు సైబరాబాద్, గ్రేటర్ హైదరాబాద్, మల్కాజిగిరి డిప్యూటి కమిషనర్లు పర్యవేక్షిస్తారు. 14 బార్ల కోసం డిప్యూటి కమిషనర్ల పరిధిలోని దరఖాస్తుదారులు ది అడ్రస్ కన్వెన్షన్ అండ్ ఎగ్జిబిషన్ నార్సింగ్, గండిపేట మండలం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు సైబరాబాద్ డిప్యూటి కమిషనర్ జె.హరికిషన్ తెలిపారు. దరఖాస్తుదారులకు ఇప్పటికే వాట్సాప్ ద్వారా, ఎస్ఎంఎస్ ద్వారా సమాచారాన్ని చేర వేశామని, అందరు ఉదయం. 9గంటల వరకు హాజరు కావాలని డిప్యూటి కమిషనర్లు కోరారు.

## టిడిపి సభ్యత్వ రెన్యువల్ కొరకు ఎన్టీఆర్ భవన్ కు విచ్చేసిన కార్యకర్త..

**నల్లగొండ జిల్లా కల్లేపల్లి గ్రామం నుండి హైదరాబాద్ ఎన్టీఆర్ భవన్ కు వాకుడోతు సేన నాయక్..**

**పార్టీ పట్ల తనకు ఉన్న నిబద్ధతను చూసి శాలువాతో సత్కారం చేసిన బక్కని నరసింహులు..**




**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
తెలంగాణ టీడీపీ పార్టీ ఎన్టీఆర్ భవన్ నేటి సమాజంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీల్లోకి మారే నాయకులను,లీడర్లను ఎంతో మందిని చూశాము,కానీ సామాన్య రైతు కుటుంబంలో పుట్టి 5వ తరగతి వరకే అవకాశం చదువుకొని వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న శ్రమిక జీవి వాకుడోతు సేనా నాయక్ తనదీ,తన జీవిత భాగస్వామి వారి ఇరువురి టిడిపి సభ్యత్వం కార్డు రెన్యువల్ కొరకు నేడు ఎన్టీఆర్ భవన్ కు విచ్చేసి కార్డు రెన్యువల్ చేయవలసిందిగా అధిష్టానాన్ని కోరిన కార్యకర్త, పార్టీ పట్ల తనకు ఉన్న మమకారం,విధేయత, నిబద్ధతను చూసి మాజీ రాష్ట్ర అధ్యక్షులు,పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు శాలువాతో వాకుడోతు సేనా నాయక్ ఘనంగా సత్కరించి అభినందించడం జరిగిందన్నారు.వాకుడోతు సేనా నాయక్ స్వగ్రామం,నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గం,దామరచర్ల మండలం,కల్లెపల్లి గ్రామవాసి,
ఈ సందర్భంగా బక్కని నరసింహులు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇప్పుడున్న పరిస్థితులలో నాయకులు గోడమీద పిల్లులవలె ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి మారుతున్న తరుణంలో సామాన్య వ్యవసాయం చేసుకునే కార్యకర్త నేడు ఎన్టీఆర్ భవన్ కు వచ్చి తన కార్డు రెన్యువల్ కొరకు అర్జీ పెట్టుకోవడం చాలా సంతోషకర విషయం అన్నారు.ఇలాంటి కార్యకర్తల వల్లనే టిడిపి పార్టీకి రాబోవు రోజులలో తెలంగాణ రాష్ట్రంలో పునర్వైభవం వస్తుందని ఆయన ఆశాభవం వ్యక్తపరిచారు.

## కిషన్ నగర్ లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**షాద్ నగర్ నియోజకవర్గంలోని కిషన్ నగర్ గ్రామంలో 1,020 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.అలాగే వీ బిజీ రాంజీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. అదేవిధంగా రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో మొదటి విడతలో 43 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు.రెండో దశలో మరో 10 ఇళ్లను మంజూరు చేసినట్లుపేర్కొన్నారు.అవసరమైతే మరో 10 ఇళ్లను కూడా లబ్ధిదారులకు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కిషన్ నగర్‌లో 48 మహిళా సంఘాలు ఆదర్శవంతంగా పనిచేస్తుండటం పట్ల ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు.మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ గ్రామ ప్రగతిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎలికట్ట అంబా భవానీ మాత ఆలయంలో మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి ప్రత్యేక పూజలు





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**షాద్ నగర్ నియోజకవర్గంలోని ఫరుక్ నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో వెలసిన అంబా భవాని మాత నవరాత్రి పర్వదినాల్లో శ్రీ లలితా త్రిపురసుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వగా,పవిత్రమైన శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎలికట్ట అంబా భవానీ మాత ఆలయాన్ని కేశంపేట మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి సందర్శించి,శ్రీ లలితా త్రిపురసుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు ఆయురా రోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ప్రార్థించారు.నవరాత్రి పర్వదినాల్లో అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో పవిత్రమైన విషయమని, భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించడం ద్వారా ఆధ్యాత్మిక ప్రశాంతత,మనోధైర్యం లభిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చంద్రయ్య,సర్పంచ్ నవ కిరణి నరసింహ ముదిరాజ్,శ్రీశైలం,శ్రీకాంత్,ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతోకొనసాగుతున్నాయి.

## మానవత్వమే మనిషికి నిజమైన ఆభరణం..

**ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే అసలైన సేవాధర్మం..!**





**విజయవాడ,(ప్రజావినికిడి):**
జీవిత చరమాంకంలో, ఎన్నో కష్టాలను, ఒంటరితనాన్ని ఎదుర్కొంటూ, ఆప్యాయత కోసం ఎదురుచూస్తున్న వృద్ధుల ముఖాల్లో, చిరునవ్వులు పూయించడం కంటే,గొప్ప ఆనందం మరొకటి లేదు.అలాంటి ఓ గొప్ప సేవా కార్యక్రమం బుధవారం, విజయవాడలో ఆవిష్కృతమైందివివరాలు లోకి వెళ్తే, చిరంజీవి గరికిపాటి విష్ణు ఇటీవలే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా చేరారు తన తల్లి అడుగుజాడల్లో నడుస్తూ నెలనెలా తనకు వచ్చే జీతం నుండి కొంత మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగించాలనే లక్ష్యంతో, రేపు వారి చెల్లెలు లాస్య ఓ నీల వేడుక సందర్భాన్ని పురస్కరించుకొనిబుధవారం రోజు రామవరప్పాడు లోని అశ్రిత వృద్ధాశ్రమంలోని, 55 మంది వృద్ధులకు, నూతన వస్త్రాలను,అదేవిదంగా భోజనాలను ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారు. స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలోట్రస్ట్ చైర్మన్ లయన్ డాక్టర్ పులి శ్రీనివాస ప్రసాద్, కార్యక్రమ దాత విష్ణు,వారి తల్లి, గరికిపాటి దేవి సుకన్య,చెల్లి, లాస్య, మామయ్య, పసుపులేటి రవికాంత్, అత్తమ్మ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం విగ్రహాన్ని పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన మాజీ కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి




**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
గురువారం రోజు భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి (ప్రపంచ విద్యార్థుల దినోత్సవం) పురస్కరించుకుని బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సచివాలయ నగర్ స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి అబ్దుల్ కలాం విగ్రహాన్ని పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా లచ్చి రెడ్డి మాట్లాడుతూ, శాస్త్రవేత్తగా,దేశ రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం భారతదేశానికి చేసిన సేవలు అనన్యసామాన్యమైనవని కొనియాడారు. సాంకేతిక రంగంలో దేశాన్ని ప్రపంచ అగ్రగామిగా నిలపడంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు.ఆయన జీవితం, ఆదర్శాలు నేటి యువతకు, విద్యార్థులకు ఎంతో స్ఫూర్తిదాయకమని,ప్రతి ఒక్కరూ కలాం అడుగుజాడల్లో నడిచి దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్ నేత,రవి శంకర్ స్ఫూర్తి సేవా సమితి సభ్యులు సంజయ్ కుమార్, యాదగిరి,గిరి, సంజీవ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఎల్బీనగర్ లో పెండింగ్ ఉన్న యూ జీ డీ పనులకు నిధులు మంజూరు చేయాలి.. -ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
గురువారం రోజు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హెచ్.ఎం.డబ్ల్యు.ఎస్.సివరేజ్ బోర్డ్ మల్కాజిగిరి ఈడి శ్రీమతి.పంకజ ని ఎల్బీనగర్ నియోజకవర్గంలోని వివిధ కాలనీలలో పెండింగ్‌లో ఉన్న యూ జీ డీ (అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ) పనులకు పరిపాలనా అనుమతులు, నిధుల మంజూరు కోరుతూ వారిని కలవడం జరిగింది.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల యందు నూతన పెండింగ్ డ్రైనేజ్ పనులు మంజూరు చేయాలని కోరారు.దాన్లో భాగంగా బైరమల్ గూడా లోని గోకుల్ ఎంక్లేవ్,హయత్ నగర్ డివిజన్ పరిధిలోని సిరిహిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్,శ్రీ గాయత్రి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్,దత్తాత్రేయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్,కుంట్లూర్ రోడ్డు లోని బెల్లయాదవ్ నగర్ కాలనీ,బాగ్ హయత్ నగర్ లోని సాయిరాం నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్,శ్రీ వినాయక నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్,శ్రీ వెంకటేశ్వర నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్,హస్తినాపురం డివిజన్ పరిధిలోని డైమండ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్,సుల్తాన్ వాల్వ వీకర్ సెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్,శ్రీ వెంకటేశ్వర కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్,వెంకటేశ్వర కాలనీ ఫేస్ 2,హస్తినాపురం రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్,ఖాద్రి కాలనీ,మన్సురాబాద్ డివిజన్ పరిధిలోని సి.ఎస్.ఆర్.కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్,సి.ఆర్.ఎన్క్లేవ్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్,జడ్జెస్ కాలనీ ఫేస్. 1,శ్రీరామ్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్,బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని బి.యన్.రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్,శ్రీపురం డెవలప్మెంట్ అసోసియేషన్,చైతన్యపురి డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మీనరసింహ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్,వనస్థలిపురం డివిజన్ పరిధిలోని శారద నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్,కొత్తపేట్ డివిజన్ పరిధిలోని గణేష్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్,సత్య నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్,రాజీవ్ గాంధీ కాలనీ,నాగోల్ డివిజన్ పరిధిలోని ఆఫ్కో కాలనీ రెసిడెన్సి వెల్ఫేర్ అసోసియేషన్,గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని తిరుమల నగర్ కాలనీ నందు డ్రైనేజీ పనులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం పంకజ మాట్లాడుతూ, సుధీర్ రెడ్డి ఇచ్చిన నివేదిక ప్రకారం కొన్ని పనులు ఇప్పటికే మంజూరు చేయడం జరిగిందని,
అలాగే ప్రధాన సమస్యలు ఉన్న కాలనీల నందు డ్రైనేజ్ పనులు పూర్తిచేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు.అలాగే పెండింగ్లో ఉన్న మిగతా పనులు కూడా సకాలంలో పూర్తి చేశామని వారు హామీ ఇచ్చారు.

# 2027 ప్రపంచకప్ తర్వాత క్రికెట్‌కు సికందర్ రజా వీడ్కోలు!



## రిటైర్మెంట్‌పై వెనక్కి తగ్గేది లేదంటున్న జింబాబ్వే కెప్టెన్

## ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో అవకాశం వచ్చినా నిర్ణయం మారదని స్పష్టం

**హరారే:** జింబాబ్వే స్టార్ ఆల్‌రౌండర్, వన్డేలు, టీ20 జట్ల కెప్టెన్ సికందర్ రజా తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికే విషయంపై కీలక ప్రకటన చేశాడు. 2027లో జరిగే వన్డే ప్రపంచకప్ అనంతరం క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించనున్నట్లు స్పష్టం చేశాడు. తన నిర్ణయాన్ని మార్చుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పాడు. 2027 ప్రపంచకప్‌కు జింబాబ్వే, దక్షిణాఫ్రికా, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. సొంత గడ్డపై జరిగే ప్రపంచకప్‌లో ఆడిన తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకడం తనకు ప్రత్యేకమైన అవకాశమని రజా పేర్కొన్నాడు. ప్రపంచకప్ ఆడి రిటైర్మెంట్ తీసుకోవడం ప్రతి క్రికెటర్ కల అని అభిప్రాయపడ్డాడు. **టెస్టు ఛాంపియన్‌షిప్ వచ్చినా అంతే!** 2027-30 ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) చక్రంలో జింబాబ్వేకు చోటు దక్కినా తన రిటైర్మెంట్ నిర్ణయంలో మార్పు ఉండదని రజా స్పష్టం చేశాడు. తన కెరీర్‌కు సంబంధించి ఇప్పటికే నిర్ణయం తీసుకున్నానని, దాని నుంచి వెనక్కి తగ్గబోనని వెల్లడించాడు. అయితే జింబాబ్వేకు డబ్ల్యూటీసీలో ఆడే అవకాశం లభిస్తే ఆ దేశ క్రికెట్ అభివృద్ధికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని రజా ఆశాభావం వ్యక్తం చేశాడు. టెస్టు క్రికెట్ వల్ల ఆటగాళ్ల నైపుణ్యం పెరుగుతుందని, అన్ని ఫార్మాట్లలోనూ జట్టు ప్రదర్శన మెరుగుపడుతుందని పేర్కొన్నాడు. **యువ ఆటగాళ్లపై ఆశలు** తన కెరీర్ ముగిసిన తర్వాత జింబాబ్వే క్రికెట్‌ను ముందుకు తీసుకెళ్లే సత్తా యువ ఆటగాళ్లకు ఉందని రజా విశ్వాసం వ్యక్తం చేశాడు. బ్యాటర్ బ్రియాన్ బెన్నెట్, బౌలర్ న్యామన్ న్యామ్హురి భవిష్యత్తులో జట్టు కీలక ఆటగాళ్లుగా ఎదుగుతారని అంచనా వేశాడు. 2027 ప్రపంచకప్ తన అంతర్జాతీయ కెరీర్‌లో చివరి ప్రధాన ఘట్టం కానుండటంతో, సొంత ప్రేక్షకుల మధ్య చిరస్మరణీయ ప్రదర్శనతో వీడ్కోలు పలకాలని రజా భావిస్తున్నాడు.

# న్యూజిలాండ్ వన్డే సిరీస్‌కు బుమ్రా దూరం!



## టెస్టుల కోసం స్టార్ పేసర్‌కు విశ్రాంతి

## పనిభారాన్ని తగ్గించడమే టీమ్ మేనేజ్‌మెంట్ లక్ష్యం

**న్యూఢిల్లీ:** టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా న్యూజిలాండ్‌తో జరగనున్న ఐదు వన్డేల సిరీస్‌కు దూరంగా ఉండే అవకాశముంది. రాబోయే టెస్టు సిరీస్‌పై దృష్టి సారించడంతో పాటు, బుమ్రా పనిభారాన్ని నియంత్రించేందుకు భారత జట్టు యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. బుమ్రా ప్రస్తుతం పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నప్పటికీ, సుదీర్ఘ పర్యటనలో వరుసగా అన్ని ఫార్మాట్లలో ఆడించడం కంటే టెస్టులకు సిద్ధం చేయడానికే ప్రాధాన్యం ఇవ్వాలని మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లు సమాచారం. న్యూజిలాండ్‌తో రెండు టెస్టుల సిరీస్ నవంబర్ 19 నుంచి ప్రారంభం కానుంది. **ఇండియా-ఏ తరఫున బరిలోకి?** టెస్టు సిరీస్‌కు ముందు బుమ్రా మ్యాచ్ ప్రాక్టీస్ పొందేలా ఇండియా-ఏ జట్టు తరఫున ఒక బహుళ రోజుల మ్యాచ్‌లో ఆడించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. నవంబర్ 6 నుంచి ప్రారంభమయ్యే ఇండియా-ఏ మూడో మ్యాచ్‌లో అతడిని ఆడించాలని యోచిస్తున్నట్లు కథనాలు పేర్కొన్నాయి. **టెస్టులే లక్ష్యంగా ప్రణాళిక** ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పోటీలో కీలకంగా మారనున్న టెస్టు సిరీస్‌లతో పాటు, వచ్చే ఏడాది ఆస్ట్రేలియాతో జరగనున్న ఐదు టెస్టుల సిరీస్‌ను దృష్టిలో ఉంచుకుని బుమ్రా పనిభారాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని జట్టు యాజమాన్యం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, న్యూజిలాండ్ వన్డే సిరీస్‌కు సంబంధించి బుమ్రా ఎంపికపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, అతడిని వన్డేలకు దూరంగా ఉంచడం గాయంతో సంబంధం లేని నిర్ణయంగా కనిపిస్తోంది.

# తిలక్ ఔటవ్వడమే ఓటమికి ప్రధాన కారణం!

- భారత ఓటమిపై స్పందించిన సంజూ శాంసన్
- యువ బౌలర్లకు మరిన్ని అవకాశాలు ఇవ్వాలని సూచన



**హైదరాబాద్:** వెస్టిండీస్‌తో జరిగిన నాలుగో అంతర్జాతీయ టీ20 క్రికెట్ పోటీలో భారత జట్టు ఓటమికి తిలక్ వర్మ వికెట్ కీలక మలుపుగా మారిందని భారత క్రికెటర్ సంజూ శాంసన్ అభిప్రాయపడ్డాడు. ఈ పోటీలో భారత్ 24 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. దీంతో ఐదు పోటీల సిరీస్ 22తో సమమైంది. **కీలక సమయంలో వికెట్ కోల్పోవడంతో దెబ్బ** తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 247 పరుగులు సాధించింది. భారీ లక్ష్య ఛేదనలో భారత జట్టు 223 పరుగులకే ఆలౌటైంది. సంజూ శాంసన్ 23 బంతుల్లో 56 పరుగులు చేసి జట్టుకు శుభారంభం అందించాడు. అనంతరం తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి భారత జట్టును విజయానికి చేరువ చేసే ప్రయత్నం చేశారు. అయితే కీలక సమయంలో తిలక్ వర్మ ఔటవడంతో మ్యాచ్ స్వరూపం మారిపోయిందని సంజూ పేర్కొన్నాడు. ఆ వికెట్ జట్టు విజయావకాశాలను దెబ్బతీసిందని తెలిపాడు. **యువ బౌలర్లకు ప్రోత్సాహం అవసరం** భారత స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకు ప్రత్యామ్నాయం దొరకడం సులభం కాదని సంజూ అభిప్రాయపడ్డాడు. బుమ్రా వంటి ప్రతిభావంతులు అరుదుగా ఉంటారని పేర్కొన్నాడు. అదే సమయంలో యువ బౌలర్లకు తగినన్ని అవకాశాలు కల్పిస్తే వారు తమ ప్రతిభను నిరూపించుకోగలరని విశ్వాసం వ్యక్తం చేశాడు. **చివరి పోటీలో గెలుపే లక్ష్యం** ఒక్క పోటీలో విఫలమైనంత మాత్రాన యువ ఆటగాళ్ల సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేయకూడదని సంజూ సూచించాడు. జట్టులో ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉన్నారని, కీలక సమయంలో తప్పిదాలను సరిదిద్దుకుని ముందుకు సాగాలని పేర్కొన్నాడు. సిరీస్ విజేతను నిర్ణయించే చివరి పోటీలో భారత్ మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంది.

# భారత ఓటమికి బౌలర్లే కారణం!

## ఇదే బౌలింగ్‌తో ప్రపంచకప్ గెలవడం కష్టమే!

## మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్:** వెస్టిండీస్‌తో జరిగిన నాలుగో టీ20 క్రికెట్ పోటీలో భారత జట్టు ఓటమికి బౌలర్ల వైఫల్యమే ప్రధాన కారణమని మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ అభిప్రాయపడ్డాడు. బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకోవడంతోనే భారత్ విజయానికి దూరమైందని పేర్కొన్నాడు. ఇదే తరహా ప్రదర్శన కొనసాగితే ప్రపంచకప్ గెలవడం కష్టమని వ్యాఖ్యానించాడు. **పరుగుల వరదను అడ్డుకోవడంలో విఫలం!** తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 247 పరుగులు సాధించింది. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత జట్టు 223 పరుగులకే పరిమితమైంది. దీంతో 24 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. వెస్టిండీస్ జట్టు సారథి షాయ్ హోప్ అజేయ శతకంతో చెలరేగగా, భారత బౌలర్లు పరుగులను కట్టడి చేయడంలో విఫలమయ్యారు. **బౌలింగ్‌లో మెరుగుపడాలి** భారత జట్టు విజయాల కోసం కేవలం బ్యాటర్లపైనే ఆధారపడటం సరికాదని కైఫ్ అభిప్రాయపడ్డాడు. బ్యాటర్లు పరుగులు సాధించినప్పటికీ, బౌలర్లు ప్రత్యర్థి జట్టును కట్టడి చేయలేకపోతే విజయాలు సాధించడం కష్టమని పేర్కొన్నాడు. కీలక సమయాల్లో వికెట్లు తీయడంతో పాటు పరుగుల వేగాన్ని తగ్గించడంపై బౌలర్లు దృష్టి సారించాలని సూచించాడు. **ప్రపంచకప్‌కు ముందే లోపాలు సరిదిద్దుకోవాలి** ప్రపంచకప్ వంటి కీలక పోటీల్లో రాణించాలంటే భారత బౌలింగ్ విభాగం మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని కైఫ్ పేర్కొన్నాడు. బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్‌లోనూ తప్పిదాలను తగ్గించుకోవాలని సూచించాడు. రాబోయే పోటీల్లో ఈ లోపాలను సరిదిద్దుకుని భారత జట్టు విజయాల బాట పట్టాలని అభిమానులు ఆశిస్తున్నారు.



# 140 కోట్ల భారతీయులు గర్వించేలా చేశారు!

## - భారతీయుల ప్రశంసలు అందుకున్న ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:** దేశ ప్రజల ఆశీస్సులు, సమష్టి కృషితో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. యువత, మహిళలు, రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించారు. దేశాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యమే కీలకమని మోదీ పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పన నుంచి సాంకేతిక రంగంలో మార్పుల వరకు అనేక రంగాల్లో భారత్ ముందడుగు వేస్తోందని తెలిపారు. అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణమే లక్ష్యంగా సేవ, సుపరిపాలన, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తామని స్పష్టం చేశారు. దేశ ప్రజల సహకారంతో మరిన్ని విజయాలు సాధించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలందరి భాగస్వామ్యంతో దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు.

# ఆసీస్ పేస్ దళం బలానికి కారణమిదే!

- ఆస్ట్రేలియా బౌలింగ్ బలంపై దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ విశ్లేషణ



**హైదరాబాద్:** ఆస్ట్రేలియా వేగవంతమైన బౌలింగ్ విభాగం ప్రపంచ క్రికెట్‌లో బలమైనదిగా నిలవడానికి అనుభవం, క్రమశిక్షణ, సమష్టి కృషే ప్రధాన కారణాలని దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ అభిప్రాయపడ్డాడు. పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్ వంటి స్టార్ బౌలర్లు తమ నైపుణ్యంతో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నాడు. ఆస్ట్రేలియా బౌలర్లు కొత్త బంతితో వికెట్లు తీయడంతో పాటు, పాత బంతితోనూ పరుగులను కట్టడి చేయగలరని తెలిపాడు. వేగం, బంతిని స్వింగ్ చేయడం, కచ్చితమైన బంతులు వేయడం వంటి విభిన్న నైపుణ్యాలు ఆ జట్టుకు అదనపు బలంగా మారాయని వివరించాడు. కీలక సమయాల్లో ఒత్తిడిని తట్టుకుని ప్రణాళిక ప్రకారం బౌలింగ్ చేయడం ఆస్ట్రేలియా బౌలర్ల ప్రత్యేకతని పేర్కొన్నాడు. అనుభవజ్ఞులైన బౌలర్లు ఒకరికొకరు అండగా నిలుస్తూ జట్టుకు విజయాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అభిప్రాయపడ్డాడు.



# విరాట్ కోహ్లీకి సత్య నాదెళ్ల అభినందనలు!

- కోహ్లీ కొత్త వ్యాపార ప్రయాణానికి స్వాగతం
- సామాజిక మాధ్యమంలో క్రికెట్ దిగ్గజానికి మైక్రోసాఫ్ట్ అధినేత ప్రశంసలు

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీకి మైక్రోసాఫ్ట్ సంస్థ అధినేత సత్య నాదెళ్ల అభినందనలు తెలిపారు. కోహ్లీ సామాజిక మాధ్యమ వేదికలో తొలిసారిగా సందేశం పంచుకోవడంపై స్పందిస్తూ, ఆయన కొత్త వ్యాపార ప్రయాణానికి స్వాగతం పలికారు. ఈ స్పందన క్రికెట్ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తించింది. **కోహ్లీకి ఘన స్వాగతం** విరాట్ కోహ్లీ కొత్త వ్యాపార ప్రయత్నాలను అభినందిస్తూ సత్య నాదెళ్ల సందేశం పంపారు. కోహ్లీ రాకతో తన సందేశాల విభాగం మరింత ఆసక్తికరంగా మారిందని పేర్కొన్నారు. ఆయన చేపట్టిన కొత్త ప్రయాణం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. **క్రీడా రంగంలో కొత్త లక్ష్యం** భారతదేశంలో క్రీడలకు మరింత ప్రోత్సాహం లభించాలని, దేశీయ క్రీడా ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు రావాలని విరాట్ కోహ్లీ ఆకాంక్షించారు. భారతదేశం నుంచి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే క్రీడా వ్యాపార సంస్థలను నిర్మించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. క్రీడా వస్తువుల తయారీ, వాటి విక్రయాలు, పంపిణీ రంగాల్లో భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్నది తన ఆశయమని తెలిపారు. క్రికెట్‌లో ఎన్నో విజయాలు సాధించిన కోహ్లీ, వ్యాపార రంగంలోనూ తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారు. **వ్యాపార రంగంలోనూ కోహ్లీ అడుగులు** క్రికెట్ మైదానంలో తన ప్రతిభతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న కోహ్లీ, ఇప్పుడు క్రీడా వ్యాపార రంగంలోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. ఆయన ప్రయత్నాలకు సత్య నాదెళ్ల అభినందనలు తెలపడం విశేషంగా నిలిచింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## ‘సంబరాల ఏటిగట్టు’లో సాయిదుర్గాతేజ్ పాత్ర రివీల్.. ‘బాలి’గా సరికొత్త అవతారం!




మెగా సుప్రీమ్ హీరో సాయిదుర్గాతేజ్ అభిమానులకు చిత్రబృందం అదిరిపోయే కానుక ఇచ్చింది. అతడు హీరోగా రోహిత్ కేపీ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం ‘సంబరాల ఏటిగట్టు’లో తేజ్ పోషిస్తున్న పాత్రను వెల్లడించింది. తన పుట్టినరోజు సందర్భంగా గురువారం ఈ అప్‌డేట్ ఇచ్చింది. సినిమాలో అతడు ‘బాలి’ పాత్రలో కనిపించనున్నాడు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో చేతిలో కత్తి, డాలు పట్టుకుని, వెనుక గూడ్స్ రైలు ఉన్నట్లు కనిపించే నేపథ్యంతో తేజ్ యుద్ధవీరుడిలా దర్శనమిచ్చాడు.ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ సోషల్ మీడియాలో తేజ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది. ‘వేటగాడు.. యోధుడు.. మృగం’ అంటూ ఆయన పాత్రపై ఆసక్తి పెంచేలా పోస్ట్ చేసింది. వచ్చే సంక్రాంతికి వెండితెరపై ఆయన సరికొత్త రూపాన్ని చూడబోతున్నారని పేర్కొంది.

‘సంబరాల ఏటిగట్టు’ చిత్రాన్ని 2027 జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. గత నెలలో డబ్బింగ్ పనులను పూజా కార్యక్రమాలతో ప్రారంభించింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. సుమారు రూ.125 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు సమాచారం. ఇది సాయిదుర్గాతేజ్ కెరీర్‌లోనే అత్యంత భారీ ప్రాజెక్టుగా నిలవనుంది.


రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కె. నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్నారు. ఐశ్వర్య లక్ష్మి కథానాయికగా నటిస్తుండగా.. జగపతిబాబు, శ్రీకాంత్, సాయికుమార్, అనన్య నాగళ్ల, రవికృష్ణ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. గతంలో ఈ సినిమా కోసం జాతీయ అవార్డు గ్రహీత, స్టంట్ కొరియోగ్రాఫర్ పీటర్ హెయిన్ నేతృత్వంలో భారీ యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరించారు. సినిమాలో ఓ బాలీవుడ్ స్టార్ ప్రతినాయకుడిగా కనిపించనున్నారనే ప్రచారం కూడా ఉంది. అయితే ఆ నటుడి వివరాలను చిత్రబృందం అధికారికంగా వెల్లడించలేదు.తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. వెట్రి పళనిసామి కెమెరామెన్‌గా వ్యవహరిస్తున్నారు. అజనీశ్ లోక్‌నాథ్ సంగీతం సమకూరుస్తున్నారు. నవీన్ విజయకృష్ణ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు

## ఎక్కడ చూసినా ‘రణబాలి‘ ముచ్చటనే!



కొన్ని రోజులుగా ఎక్కడ చూసినా ‘రణబాలి‘ సినిమాను గురించే అంతా మాట్లాడుకుంటున్నారు. అందుకు కారణం ఈ కథా నేపథ్యం .. విజయ్ దేవరకొండ – రష్మిక విలక్షణమైన లుక్ .. అనే చెప్పాలి. సాధారణంగా ఒక కథకు చరిత్ర తోడైనా .. ఒక పోరాటానికి ప్రేమ తోడైనా ఆ కథపై అందరిలో మరింత ఆసక్తి కలుగుతుంది .. కుతూహలం పెరుగుతుంది. అయితే చరిత్ర .. పోరాటం .. ప్రేమ .. అనే ఈ మూడు అంశాలను కలుపుకుంటూ అల్లుకున్న కథగా ‘రణబాలి‘ కనిపిస్తుంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా, రేపు థియేటర్లలో దిగిపోనుంది. రాహుల్ సాంకృత్యన్ ఇంతవరకూ తెరకెక్కించిన సినిమాలను ఒకసారి పరిశీలన చేస్తే, ఎప్పటికప్పుడు ఆయన ప్రయోగాల దిశగా అడుగులు వేయడం కనిపిస్తుంది. విభిన్నమైన కథాంశాలను ఎంచుకుంటూ .. వాటిని అందంగా ఆవిష్కరించుకుంటూ వెళ్లిన విధానం తెలుస్తుంది. అలా రూపొందిన సినిమానే ‘రణబాలి‘గా చెప్పుకోవచ్చు. ఇంతవరకూ విజయ్ దేవరకొండ – రష్మిక రెండు సినిమాలలో నటించినప్పటికీ, ఇది పూర్తిగా భిన్నమైనదిగా చెప్పుకోవలసి ఉంటుంది. పెళ్లి తరువాత వాళ్లు కలిసి చేసిన ఫస్టు మూవీగా ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. ఇది ఆంగ్లేయుల కాలంలో .. అంటే 1870లలో జరిగిన ఒక యథార్థ సంఘటన ఆధారంగా రూపొందిన కథగా చెబుతున్నారు. ఆంగ్లేయుల కాలంలో రాయలసీమ ప్రాంతంలో ఏర్పడిన కరవు .. ఆ పరిస్థితులలోను అక్కడి ప్రజల పట్ల వాళ్లు దారుణంగా ప్రవర్తించిన తీరు .. వాళ్ల ధోరణిని ధైర్యంగా ఎదిరించిన ఒక యోధుడి కథగా ఈ సినిమాను రూపొందించారు. డిఫరెంట్ లుక్ తో విజయ్ దేవరకొండ – రష్మిక ఆకట్టుకుంటున్న ఈ సినిమా, కొత్త రికార్డులు నమోదు చేయడం ఖాయమనే టాక్ బలంగా వినిపిస్తోంది

## రజనీ ‘జైలర్ 2‘.. తప్పకుండా చూడాలన్న ధనుశ్!



సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘జైలర్ 2‘ నేడు ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది. తొలి షో నుంచే ఈ చిత్రానికి విశేషమైన స్పందన లభిస్తోంది. ముఖ్యంగా పలువురు సినీ ప్రముఖులు సినిమా చూసి సోషల్ మీడియా వేదికగా ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత, నటుడు ధనుశ్ ఈ సినిమాను “మస్ట్ మస్ట్ మస్ట్ వాచ్“ మూవీ అని అన్నారు.

ఫస్ట్ డే ఫస్ట్ షో చూసిన వెంటనే తన ‘ఎక్స్‘ ఖాతాలో స్పందించిన ధనుశ్.. “‘జైలర్ 2‘ తప్పకుండా చూడాల్సిన సినిమా.. ఇది బ్లాక్‌బస్టర్.. తలైవా అభిమానులకు ఇదొక పండగ“ అని పేర్కొంటూ ఫైర్ సింబల్స్ పోస్ట్ చేశారు. ధనుశ్ తో పాటు దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్, నటుడు విష్ణు విశాల్, నిర్మాత నాగవంశీ వంటి ప్రముఖులు కూడా సినిమాపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ స్పందిస్తూ.. “తెరపై తలైవా మంటలు పుట్టించారు. ఆయన నుంచి కళ్లు తిప్పుకోలేకపోయాను. గూస్‌బంప్స్ ఓవర్‌లోడెడ్ మాస్ బ్లాస్ట్ ఇది. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ రైటింగ్, ఎగ్జిక్యూషన్ అద్భుతం. అనిరుధ్ తన సంగీతంతో ప్రతి ఫ్రేమ్‌కు ప్రాణం పోశారు. ఒకే సినిమాలో మిథున్ చక్రవర్తి, మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్, జాకీ ష్రాఫ్, విద్యాబాలన్, హృతిక్ రోషన్, ఎస్‌జే సూర్య వంటి వారిని చూడటం అద్భుతంగా ఉంది“ అని కొనియాడారు.తెలుగు నిర్మాత నాగవంశీ సైతం సినిమాపై ప్రశంసలు కురిపించారు. “సూపర్‌స్టార్ సినిమా విషయానికి వస్తే ఫస్టాఫ్, సెకండాఫ్ పోలికలకు తావులేదు. ఈ దసరాకు బాక్సాఫీస్ వద్ద పెద్ద ధమాకా ఖాయం. ‘జైలర్ 2‘ ఆద్యంతం పీక్ మాస్ సంభవం లాంటి మూమెంట్స్‌తో నిండిపోయింది. ప్రతి యాక్షన్ బ్లాక్ అదిరిపోయింది. ఇది కుటుంబ ప్రేక్షకులకు పూర్తిస్థాయి మాస్ ఎంటర్‌టైనర్“ అని అన్నారు. దర్శకుడు నెల్సన్ రజనీకాంత్‌ను ప్రజెంట్ చేసిన విధానం, కథ, భావోద్వేగాలు అన్నీ పక్కాగా కుదిరాయని తెలిపారు. అనిరుధ్ సంగీతం గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ.. “రజనీ సర్ స్క్రీన్‌పై వెలిగిపోతుంటే, అనిరుధ్ తన పాటలు, బీజీఎంతో ప్రతి క్షణాన్ని ఫ్యూర్ ఫైర్‌వర్క్స్‌లా మార్చేశాడు“ అని పేర్కొన్నారు.

## మాస్టర్‌మైండ్ డెన్‌లో అడుగుపెట్టారు



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకధీరుడు సుకుమార్ కాంబినేషన్‌లో రాబోతున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘ఆర్‌సి 17’ ప్రయాణం అధికారికంగా మొదలు కాబోతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తమ అధికారిక ఎక్స్, ఇన్ స్టాగ్రామ్ ఖాతాల ద్వారా ఒక కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఈ సిని మా కోసం మాస్టర్‌మైండ్ డెన్‌లో అడుగుపెట్టారని పేర్కొంటూ.. సుకుమార్, నిర్మాత రవిశంకర్‌తో పాటు రచయితల బృందంతో కలిసి సినిమా ఆఫీస్‌లో ఉన్న ఫొటోను పంచుకుంది. త్వరలోనే పూజా కార్యక్రమాలతో ‘ఆర్‌సి17’ ప్రయాణం ప్రారంభమవుతుందని వెల్లడించింది. అయితే విశ్వసనీయ సమాచారం మేరకు చిత్ర బృందం అక్టోబర్ 20వ తేదీన దసరా పండుగ సందర్భంగా హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాన్ని ని ర్వహించాలని నిర్ణయించిందని తెలిసింది. అదే రోజు టైటిల్ లో గో, కాన్సెప్ట్ పోస్టర్ విడుదలయ్యే అవకాశం ఉందని టాక్. డి సెంబర్ మొదటి వారం నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందట. ఇది పాన్ ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్‌తో రూ పొందనున్న గ్రామీణ నేపథ్యమున్న యాక్షన్ డ్రామా అని తెలిసింది. 2018లో వచ్చిన ’రంగస్థలం’ బ్లాక్‌బస్టర్ తర్వాత రామ్ చరణ్, – సుకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది కావడంతో అభిమానుల్లో, ట్రేడ్‌వర్గాల్లో భారీ అంచనాలున్నాయి

## కృతి శెట్టి బాలీవుడ్ కి వెళ్తుందా?



ఉప్పెన– చిత్రంతో ఓవర్ నైట్ ళక్ష స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్న కృతి శెట్టి అలియాస్ నాగలక్ష్మి గురించి పరిచయం అక్కర్లేదు. తొలి సినిమాతోనే కుర్రకారు మనసు దోచుకున్న బ్యూటీ ఆ తర్వాత వరుస ప్రాజెక్ట్‌లతో సౌత్ ఇండస్ట్రీలో దూసుకెళ్లింది. తాజాగా కృతి శెట్టి కెరీర్‌లో మరో అడుగు ముందుకేస్తుంది. ఈ ముద్దుగుమ్మ బాలీవుడ్ బాట పట్టేందుకు సిద్ధమైంది. హిందీ తెరపైనా అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ఓ క్రేజీ ప్రాజెక్ట్‌ను లాక్ చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి ప్రముఖ దర్శకురాలు విధి గెడ్డగాంకర్ దర్శకత్వంలో తెరకెక్కనున్న సరికొత్త లవ్ స్టోరీ ప్రాజెక్ట్ ద్వారా కృతి శెట్టి బాలీవుడ్‌లోకి గ్రాండ్‌గా ఎంట్రీ ఇస్తోందని సమాచారం. యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా.. స్వచ్ఛమైన ప్రేమకథా చిత్రంగా ఈ మూవీ రూపుదిద్దుకోనుంది. విధి గెడ్డగాంకర్ టేకింగ్ .. నేటి తరానికి నప్పేలా ఉండే ఎమోషనల్ పాయింట్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సౌత్‌లో లవ్ అండ్ క్యూట్ క్యారెక్టర్లతో ప్రేక్షకులను కట్టిపడేసిన కృతి శెట్టి హిందీ ప్రాజెక్ట్‌తో బాలీవుడ్ ఆడియన్స్‌ను కూడా ఫిదా చేయడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందని.. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వెలువడే అవకాశం ఉందని బాలీవుడ్ వర్గాల ద్వారా తెలుస్తోంది. కృతి గ్లామర్ మాత్రమే కాకుండా చక్కటి అభిన యానికి ప్రాధాన్యత ఉన్న పాత్ర కావడంతో ఈ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. హిందీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవడానికి ఈ లవ్ స్టోరీ పర్ఫెక్ట్ లాంఛ్ ప్యాడ్ అవుతుందని నమ్ము తున్నారు. ఇప్పటి వరకు తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో నటించిన కృతి శెట్టి బాలీవుడ్ ఎంట్రీతో పాన్-ఇండియా ప్రయాణాన్ని మరింత విస్తృతం చేసుకోనుంది. విభిన్న భాషల చిత్రాల్లో నటిస్తూ తనలోని నటిని నిరంతరం మెరుగుపరుచుకుంటున్న అమ్మడికి హిందీ ప్రాజెక్ట్ కెరీర్ పరంగా టర్నింగ్ పాయింట్ అయ్యే ఛాన్స్ ఉంది. నేటి ట్రెండ్‌కు తగినట్లుగా యూత్‌ను అట్రాక్ట్ చేసే అన్ని హంగులు ఈ సినిమాలో ఉండేలా దర్శకురాలు ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. సౌత్ నుంచి బాలీవుడ్‌కు వెళ్తున్న యంగ్ హీరోయిన్ల జాబితాలో కృతి శెట్టి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ సినిమాతో ఆమె అక్కడ ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613